


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
సంపుటి: 5 సంచిక: 255, పేజీలు - 08
ఆదివారం, మార్చి 1, 2026 వెల: 5 రూ/.




హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD



## ప్రపంచ యుద్ధం ముంగిట

# మానవాళి.?

**- ఇరాన్ పై ఇజ్రాయెల్ దాడి - భారీ పేలుళ్లతో దద్దరిల్లిన టెహ్రాన్**





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రపంచం ఇప్పుడు ఒక అత్యంత ప్రమాదకరమైన మలుపు వద్ద నిలబడింది. మనం వింటున్నది కేవలం క్షిపణుల మోత మాత్రమే కాదు.. బహుశా మూడో ప్రపంచ యుద్ధపు అడుగుజడలు! 2026, ఫిబ్రవరి 28, శనివారం మధ్యాహ్నం ఇరాన్ గడ్డపై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడులు భౌగోళిక రాజకీయ ముఖచిత్రాన్ని ఒక్కసారిగా మార్చేశాయి. 'తిరిగి రాని స్థితి' ని ప్రపంచం దాటేసిందా? అన్న అనుమానాలు ఇప్పుడు ప్రతి ఒక్కరినీ ఉలిక్కిపడేలా చేస్తున్నాయి. ఇరాన్ రాజధాని టెహ్రాన్ నగరం శనివారం మధ్యాహ్నం నిప్పుల కొలిమిలా మారింది. యూనివర్శిటీ స్ట్రీట్, జంహూరి వంటి అత్యంత రద్దీ ప్రాంతాలు లక్ష్యంగా అమెరికా-ఇజ్రాయెల్ క్షిపణులు విరుచుకుపడ్డాయి. మరీ ముఖ్యంగా, ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ కార్యాలయాలకు అతి సమీపంలోనే పేలుళ్లు సంభవించడం చూస్తుంటే, ఇది కేవలం హెచ్చరిక మాత్రమే కాదు, ఇరాన్ వ్యవస్థనే కూల్చివేసే వ్యూహమని అర్థమవుతోంది. ఉత్తర సయ్యద్ ఖండాన్ ప్రాంతంలో ఎగిసిపడుతున్న పొగలు ప్రపంచ దేశాలను వణికిస్తున్నాయి.

### ఇరాన్ కు అడ్డుకట్ట వేయడమే లక్ష్యం.!

"ఇజ్రాయెల్ దేశానికి పొంచి ఉన్న ముప్పును తొలగించేందుకే ఈ ముందస్తు దాడి చేశాం" అని ఆ దేశ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ ప్రకటించారు. ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమానికి అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా 2లో..

## అన్ని పక్షాలు సంయమనం పాటించాలి

**- ఇరాన్ ఇజ్రాయెల్ దాడులపై భారత్ వైఖరి**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఇరాన్, గల్ఫ్ ప్రాంతంలో శనివారం చోటుచేసుకున్న తాజా పరిణామాలపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో తన వైఖరి వెల్లడించింది. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో అన్ని పక్షాలు సంయమనం పాటించాలని, పరిస్థితులు మరింత దిగజారకుండా చూడాలని భారత్ కోరింది. ముఖ్యంగా పౌరుల భద్రతకు అత్యంత 2లో..

## హైదరాబాద్ రియల్ ఎస్టేట్ ఫ్రాడ్ కేసులో ఆస్తుల అటాచ్

**- సాయి సూర్య డెవలపర్స్‌కు చెందిన రూ.14.63 కోట్ల ఆస్తుల అటాచ్**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్లాట్ల పేరుతో సామాన్యులను మోసగించిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హైదరాబాద్ జోనల్ అధికారులు కీలక చర్యలు తీసుకున్నారు. 'సాయి సూర్య డెవలపర్స్' సంస్థకు చెందిన రూ. 14.63 కోట్ల విలువైన స్థిరాస్తులను మనీలాండరింగ్ నిరోధక 2లో..



# సంక్షేమ పథకాలే పేదలకు ఆసరా

**- సుపరిపాలన- ప్రజారోగ్యానికి తొలి ప్రాధాన్యం**
**- కర్నూలులో స్టేట్ కాన్సర్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు**
**- మూడేళ్లలో ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి**
**- గత పాలనలో ప్రజలకే కాదు దేవుడికీ ద్రోహం**
**- విజయనగరం జిల్లా చీపురుపల్లి ప్రజా వేదిక సభలో సీఎం చంద్రబాబు**



విజయనగరం (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని కాన్సర్ నివారణకు హెచ్ పీవీ వ్యాక్సిన్ సహా అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. భవిష్యత్తులో కాన్సర్ సోకకుండా 15 ఏళ్ల లోపు బాలికలంతా విధిగా హెచ్ పీవీ టీకాలు వేయించుకోవాలని పిలుపునిచ్చారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గం రావి వలసలో హెచ్ పీవీ వ్యాక్సినేషన్ , పేదల సేవల కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు.
అనంతరం ప్రజా వేదిక సభకు హాజరై ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఆడబిడ్డలు సర్వై కల్, బ్రెస్ట్ క్యాన్సర్ బారిన పడకుండా రక్షించేందుకు దేశ వ్యాప్తంగా హెచ్ పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమానికి ప్రధాని మోదీ శ్రీకారం 2లో..

## సర్వైకల్ క్యాన్సర్‌పై సమరం

**- దేశవ్యాప్త హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ ప్రారంభించిన ప్రధాని**



అజ్మీర్ (ప్రశ్న న్యూస్) సర్వైకల్ క్యాన్సర్‌పై ప్రధాని నరేంద్ర మోదీ దేశవ్యాప్త పోరాటానికి శ్రీకారం చుట్టారు. మహిళల్లో క్యాన్సర్ మరణాలకు ప్రధాన కారణాల్లో ఒకటైన గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నిర్మూలించే లక్ష్యంతో 14 ఏళ్లు పైబడిన బాలికల కోసం రూపొందించిన హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని రాజస్థాన్‌లోని అజ్మీర్ నుంచి లాంఛనంగా ప్రారంభించారు. 2లో..

## శారదా పీఠం భూములపై ప్రభుత్వం కీలక నిర్ణయం

**- వివాదానికి ముగింపు, సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** శారదా పీఠం భూములపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కోకాపేటలోని భూములను శారదాపీఠానికే కేటాయించింది. జలమండలికి ఇచ్చిన భూములను ప్రభుత్వం రద్దుచేసింది. శారదాపీఠం నిర్మాణాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా సరైన వివరాలు ఇవ్వలేదని అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి శ్రీధర్‌బాబును కలిసి వివరాలు ఇవ్వాలని పీఠం ప్రతినిధులకు సీఎం రేవంత్ సూచించారు. శారదా పీఠం భూముల వ్యవహారంపై మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపణల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం స్పందించింది. శారదా పీఠాన్ని కూల్చడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని హరీష్ రావు ఆరోపించారు.
కేసీఆర్ హయాంలో గండిపేట మండలం కోకాపేట నియోపోలీస్‌లో విశాఖ శారదా పీఠానికి భూములను కేటాయించారు. ఈ భూములను ప్రస్తుతం ప్రభుత్వం తిరిగి



స్వాధీనం చేసుకోడానికి సిద్ధమవుతుందని హరీష్ రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. కోకాపేట సర్వే నంబర్ 2లో..

## ఇప్పటి వరకు ఒక లెక్క నేటి నుంచి మరొలెక్క

**- ఇక దబిడి దిబిడే**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో ఎండల తీవ్రత ఎక్కువవుతుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఎండల తీవ్రత 35 డిగ్రీలు నమోదైనా మార్చి మొదటి వారం నుంచి 40 డిగ్రీలు దాటే అవకాశలున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కి కరువు వచ్చే అవకాశలు ఉన్నాయని కూడా కొందరు విశ్లేషిస్తున్నారు. పడాల్సిన సమయంలో వానలు 2లో..

## భూ భారతి కాదు.. అది భూ దోపిడీ

**- చేతనైతే దోపిడీని అడ్డుకోవాలని హరీశ్ రావు సవాల్**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన భూ భారతి పోర్టల్‌పై మాజీమంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. భూ భారతి కాదు భూ దోపిడీ అని తీవ్రగా విమర్శించారు. ఎంతో గొప్పగా చెప్పుకుంటూ తీసుకొచ్చిన భూ భారతి పోర్టల్.. ఇప్పుడు అక్రమార్కులకు అడ్డాగా మారింది అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ధ్వజమెత్తారు. ధరణి మీద బురదజల్లి భూ భారతి తెచ్చామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ఆ పోర్టల్‌లో జరుగుతున్న కుంభకోణంపై ఎందుకు నోరు మెదపడం లేదని మండిపడ్డారు. శనివారం జనగామ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో 3లో..



## శత్రువులు తమ దాడులకు చింతించేలా బదులిస్తాం


**- ఇజ్రాయెల్-అమెరికా దాడులపై ఇరాన్ స్పందన** 2లో..



## నాన్న లేకపోతే ఇన్ని సమస్యలా.?

**- లెటర్ రాసి సూసైడ్ చేసుకున్న లేడీ కానిస్టేబుల్**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రక్షణ కల్పించాల్సిన పోలీసు యూనిఫామ్‌లో ఉన్న ఒక కానిస్టేబుల్ మనోవేదనతో ఆత్మహత్య చేసుకుంది. వికారాబాద్ పట్టణంలో తీవ్ర సంచలనంగా మారింది దివ్య సూసైడ్. ధరూర్ పోలీస్ స్టేషన్‌లో రైటర్‌గా 2లో..



## సౌదీ బస్సు ప్రమాద బాధితులకు పరిహారం

**- చెక్కులు అందించిన సీఎం రేవంత్ రెడ్డి**
**- గత ఏడాది నవంబర్‌లో మృతి చెందిన 44 మంది**
**- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం అందజేత**
**- గాయపడిన వారికి రూ.3 లక్షల చొప్పున అందజేత**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** 2025 నవంబర్ నెలలో సౌదీ అరేబియాలో జరిగిన బస్సు ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబసభ్యులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిహారం అందించారు. ఈ ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన 44 మంది ప్రాణాలు కోల్పోగా మృతుల కుటుంబాలకు సీఎం రేవంత్ రెడ్డి పరిహారం చెక్‌లు అందించారు. ఒక్కొక్కరికి 5 లక్షల చొప్పున 44 మంది కుటుంబాలకు 2లో..

## కాకినాడ జిల్లా వేట్లపాలెంలో బాణసంచా కేంద్రం పేలుడు

**- ఘటనా స్థలాన్ని స్వయంగా పరిశీలించిన సీఎం చంద్రబాబు**
**- 23 మంది మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి**
**- క్షతగాత్రులను పరామర్శించి ధైర్యం చెప్పిన చంద్రబాబు**
**- ప్రమాద బాధితులకు ప్రధాని మోదీ పరిహారం ప్రకటన**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో జరిగిన ఘోర అగ్నిప్రమాద స్థలానికి ముఖ్యమంత్రి చంద్రబాబు చేరుకున్నారు. బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన భారీ పేలుడు ఘటనపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద స్థలిని స్వయంగా పరిశీలించిన సీఎం అక్కడ నెలకొన్న భయానక పరిస్థితులను చూసి చలించిపోయారు. మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ప్రమాద తీవ్రత, పేలుడుకు గల కారణాలపై అక్కడికక్కడే అధికారులను అడిగి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. 2లో..

# సంక్షేమ పథకాలే పేదలకు ఆసరా

చుట్టారు. నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ వల్లే ప్రపంచవ్యాప్తంగా 74 శాతం మరణాలు సంభవిస్తున్నాయి. దేశంలో ఇవి 63 శాతం ఉండగా మన రాష్ట్రంలో 68 శాతంగా ఉన్నాయి. ఏపీలో క్యాన్సర్ కేసులు 2021లో 29,379 నుంచి 2025కి 32,657కు పెరిగాయి. క్యాన్సర్ కేసుల్లో సుమారు 65 శాతం మహిళల్లో నమోదవుతున్నాయి. బ్రెస్ట్, సర్వై కల్ వంటి క్యాన్సర్లు మహిళల్లో అధికంగా ఉంటే, పురుషుల్లో నోటి క్యాన్సర్ ఎక్కువగా వస్తోంది. సర్వైకల్ క్యాన్సర్ రాష్ట్రంలో ప్రధాన సమస్యగా మారింది. ప్రతీ లక్ష మంది మహిళల్లో 15 నుంచి 20 మంది సర్వై కల్ క్యాన్సర్ బారిన పడుతున్నారు. ఈ వ్యాక్సిన్ కు రూ.4 వేలు ఖర్చవుతుంది. ప్రజారోగ్యం దృష్ట్యా ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. 3.45 లక్షల బాలికల వ్యాక్సినేషన్ కోసం రూ.14.11 కోట్లు వ్యయం చేస్తున్నాం. రాష్ట్రంలో 15 ఏళ్ల లోపు వయసున్న బాలికలు 3,45,377 ఉండగా, విజయనగరం జిల్లాలో 11,989 బాలికలున్నారు. వ్యాక్సినేషన్ కోసం రాష్ట్రంలో 1,645 కోల్డ్ చైన్ పాయింట్లు ఏర్పాటు చేసి 16,912 సిబ్బందిని నియమించామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

### లక్షలో 18 మంది క్యాన్సర్ బారిన

ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వైకల్ క్యాన్సర్ కట్టడికి 90--70--90 వ్యూహాన్ని రూపొందించిందని ముఖ్యమంత్రి చెప్పారు. మనదేశంతో పాటు జాంబియా, సౌత్ ఆఫ్రికా, ఇండోనేషియా దేశాల్లో క్యాన్సర్ ఎక్కువగా ఉంటోంది. మన దేశంలో లక్షలో 18 మందికి క్యాన్సర్ సోకుతోంది. క్యాన్సర్ కలుషిత వాతావరణంతో పాటు మన అలవాట్లే దీనికి ప్రధాన కారణం. సర్వైకల్ క్యాన్సర్ నివారణకు 90 శాతం మంది పిల్లలకు వ్యాక్సిన్ ఇవ్వాలి. ఒకసారి డోస్ తీసుకుంటే రక్షణ పొందవచ్చు. ఈ టీకాలు ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆస్పత్రులు ఇతర ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా వేస్తారు, యువిన్ యాప్ ద్వారా ఈ వ్యాక్సినేషన్ ప్రక్రియను కేంద్రం పర్యవేక్షిస్తోంది. టీకా ఇచ్చాక 30 నిమిషాలు డాక్టర్ల పర్యవేక్షణలో ఉంటారు. దీని వల్ల ప్రమాదం ఉండదు. 15 ఏళ్ల వయసున్న బాలికలంతా ఈ వ్యాక్సిన్ వేసుకునేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

### ప్రజారోగ్యానికి రాష్ట్రంలో అధిక ప్రాధాన్యత

రాష్ట్రంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు విస్తృతంగా జరిపిస్తున్నాం. ఇప్పటివరకు 1.72 కోట్ల మందికి నోటి క్యాన్సర్ స్క్రీనింగ్, 90.39 లక్షల మంది మహిళలకు బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ జరిగింది. నోటి క్యాన్సర్‌కు సంబంధించి 5,07,590 మందిని, బ్రెస్ట్ క్యాన్సర్‌కు సంబంధించి 2,50,897 మంది, సర్వైకల్ క్యాన్సర్‌కు సంబంధించి 3,40,154 మందిని రిఫర్ చేశాం. కర్నూలులో రూ. 50 కోట్లతో స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేస్తున్నాం. గత బడ్జెట్ కంటే 4 శాతం పెంచి ఈ బడ్జెట్ లో వైద్య ఆరోగ్య రంగానికి రూ.19305 కోట్లు కేటాయించాం. రాష్ట్ర బడ్జెట్ లో ఇది 6 శాతంగా ఉండటం ప్రజారోగ్యానికి ఎన్డీఏ ప్రభుత్వ ప్రాధాన్యతకు నిదర్శనం. యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా రూ.2.5 లక్షల వరకు అందరికీ ఉచిత వైద్య సేవలు అందిస్తున్నాం. రూ.25 లక్షల వరకూ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ద్వారా పేదలకు ఉచిత వైద్యం అందించేలా ఈ పాలసీ రూపకల్పన జరిగింది. ప్రజారోగ్యం కోసం సంజీవని ప్రాజెక్టు తెస్తున్నాం. త్వరలో వైద్య సలహాల కోసం ఏఐ డాక్టర్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చే ఆలోచన చేస్తున్నాం. క్రిమిసంహారక మందులతో పండించిన ఆహారం తీసుకుని క్యాన్సర్ బారిన పడుతున్నాం. అలాగే ప్రతి ఒక్కరూ మితాహారం తీసుకుంటే ఆరోగ్యం బాగుంటుంది. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీని తీర్చిదిద్దాలనే ది కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

### పింఛనుతో పేదల జీవితాల్లో వెలుగులు

20 నెలలుగా ఒకటో తేదీన నేను స్వయంగా పింఛన్ల పంపిణీలో పాల్గొంటున్నాను. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 62,76,322 మందికి పింఛన్లు ఇస్తుండగా, నెలకు రూ.2,726 కోట్ల మేర ఖర్చు చేస్తున్నాం. ఏడాదికి ఈ పథకం కోసం రూ. 33 వేల కోట్లు వెచ్చిస్తున్నాం. గత ప్రభుత్వంలో ఒక నెల పింఛను తీసుకోకపోతే నిలిపి వేసేవారు. కూటమి అధికారంలోకి వచ్చాక పేదలకు అండగా ఉండాలన్న లక్ష్యంతో మూడు నెలలదీ కలిపి ఒకేసారి తీసుకునే వెసులుబాటు కల్పించాం. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా ఏర్పడి ఎన్నికలకు వెళితే ప్రజలు బ్రహ్మరథం పట్టారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో పరిస్థితి అధ్వానంగా ఉంది. కనీసం నవ్వడానికి వీలు లేదు. ఇళ్లలో ఎవరూ సురక్షితంగా ఉండలేకపోయారు. రౌడీయిజం పరాకాష్టకు చేరింది. నాపై అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టారు. అయినా నేను కుంగిపోలేదు. ప్రజల కోసమే పనిచేస్తున్నాను. మిత్రుడు పవన్ కల్యాణ్ రాష్ట్రం కోసం అండగా నిలబడ్డారు. వెంటిలేటర్ పై ఉన్న మన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కేంద్రం ఆక్సిజన్ అందిస్తోంది. ప్రజలు ఎన్డీఏను గెలిపించడంతో ఢిల్లీలో కూడా మన పరపతి పెరిగిందని ముఖ్యమంత్రి అన్నారు.

### సమపాళ్లలో అభివృద్ధి, సంక్షేమం

ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ ను సూపర్ హిట్ చేశాం. ఆడబిడ్డల కోసం కోసం స్త్రీ శక్తి తీసుకొచ్చాం. ఇప్పటి వరకూ 47 కోట్లకు పైగా ఉచిత బస్సు ప్రయాణాలు చేశారంటే అదీ ఆడబిడ్డల సంక్షేమంపై మన ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి. దీపం పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. అన్నదాత సుఖీభవ కింద రెండు విడతల్లో రూ.6,310 కోట్లు ఇచ్చాం. మెగా డీఎస్సీ ద్వారా 15,941 టీచర్ పోస్టులు భర్తీ చేశాం. గత ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టూ భర్తీ చేయలేదు. విద్యపై అసలు దృష్టే పెట్టలేదు. జనాభా తగ్గుదల ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలో చిన్న పిల్లల సంఖ్య తగ్గుతోంది. జనాభానే మన దేశ సంపద. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ వస్తోంది. ఇప్పటికే టీసీఎస్, కాగ్నిజెంట్ వచ్చాయి. భోగాపురం ఎయిర్ పోర్టులు రాకతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో అభివృద్ధి జరిగి ఉపాధి పెరుగుతుంది. విజయనగరం జిల్లాలో ట్రైబల్ యూనివర్సిటీ త్వరలోనే ప్రారంభమవుతుంది. రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లు పెట్టి పేదల ఆకలి తీర్చాం. ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడి ఉన్న వారందరినీ ఆదుకునేందుకే పీ4 విధానం తీసుకొచ్చాం. పీ4 ద్వారా భవిష్యత్‌లో మంచి ఫలితాలు వస్తాయి. మేము అధికారంలోకి వస్తూనే ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దు చేశాం. గత ప్రభుత్వంలో భూములు రికార్డులు తారుమారు చేశారు. అడిగిన భూములు ఇవ్వకపోతే 22ఏ కింద పెట్టేశారు. డిసెంబర్ లోగా అన్ని భూములు సర్వే చేస్తాం అని ముఖ్యమంత్రి తెలిపారు.

### దేవుడికి ద్రోహం చేశారు

గత పాలకులు తిరుమల వేంకటేశ్వర స్వామికే అపచారం తలపెట్టారు. స్వామి ప్రతిష్టను దెబ్బతీయాలని చూశారు. కెమికల్స్ తో లడ్డూ తయారు చేసి స్వామికి నైవేద్యంగా పెట్టారు. ప్రజలకే కాదు దేవుడికి కూడా ద్రోహం చేయాలని చూశారు. అలాంటి వారు రాజకీయాల్లో ఉంటే సమస్యలు వస్తాయి. దేవుడికి కూడా ద్రోహం చేసే వారికి వదిలిపెట్టకూడదు. నేను ఆ దేవుణ్ణి బజారులోకి లాగాలనుకోలేదు. కానీ జరిగిన తప్పులను ప్రజలకు వివరించాను. చేసిన తప్పును ఇతరులపై నెట్టే ప్రయత్నం చేశారు. గత ఐదేళ్లలో లడ్డూ నాణ్యత ఎలా ఉందో మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎలా ఉందో ప్రజలు గమనించాలి. వైసీపీ వాళ్లు అసెంబ్లీలో ప్రజా సమస్యలు చర్చించేందుకు రారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తామంటున్నారు. అడ్డదారులు, బెదిరింపులు, దౌర్జన్యాలతో రాజకీయాలు చేస్తున్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని గంజాయికి నిలయంగా మార్చేశారని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో మూడేళ్లలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతీ ఎకరాకూ నీరిస్తామని సీఎం వెల్లడించారు.

## ఇప్పటి వరకు ఒక లెక్క నేటి నుంచి మరొలెక్క

పడకపోవడం రైతులకు కష్టాలు అతి దగ్గరలోనే వున్నాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఎలినినో ప్రభావం తో వర్షాలు చాలా చాలా తక్కువ గా అంటే సాధారణ కంటే తక్కువ గా నమోదవుతాయని పేర్కొంది. మార్చి, ఏప్రిల్, మే, జూన్ వరకు కూడా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లో ఏండల తీవ్రత ఉంటుంది. ముఖ్యం గా వృద్ధులు, పిల్లల జాగ్రత్త లు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ సంవత్సరం ఏండల తీవ్రత నుంచి తగిన జాగ్రత్త లు తీసుకోవాలి. 50 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశాలు వున్నాయన్న హెచ్చరికలు వినిపిస్తున్నాయి.

### నేటి నుంచి మాత్రం..

ప్రస్తుతం బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఉపరితల ద్రోణి ఆవర్తనం కారణంగా కొంత చల్లటి వాతావరణం నెలకొంది. అయితే మార్చి మొదటి వారం నుంచి ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని అమరావతి వాతావరణ శాఖ వెల్లడిచింది. మార్చి మొదటి వారం నుంచే ఎండలు మండిపోతాయని, ఈసారి భానుడి ప్రతాపం ఒక లెవెల్లో ఉండే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనంత ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని, పగటి పూట బయటకు రాకపోవడమే మంచిదన్న సూచనలు వెలువడుతున్నాయి. అదే సమయంలో చిన్నారులు, దీర్ఘకాలిక రోగులు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు కూడా సూచిస్తున్నారు.

### పొడి వాతావరణం..

తెలంగాణలో శనివారం కూడా వాతావరణం పొడిగా ఉండనుందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. పలు జిల్లాలో నేడు కూడా వానలు పడే అవకాశముందని పేర్కొంది. కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశముందని, ఎల్లో అలెర్ట్ జారీ చేసినట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. అయితే మిగిలిన చోట్ల మాత్రం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, ఉక్కపోత వాతావరణం నెలకొని ఉంటుందని చెప్పారు. ఉష్ణోగ్రతలు గరిష్టంగా 33 డిగ్రీలు నమోదవుతాయని చెప్పింది. ఇక నేటి నుంచి ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేసింది

## శత్రువులు తమ దాడులకు చింతించేలా బదులిస్తాం

టెహ్రాన్ (ప్రశ్న న్యూస్) అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా నిర్వహించిన వైమానిక దాడులపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. తమ దేశ సార్వభౌమాధికారంపై జరిగిన ఈ దాడికి అధికారం, బలంతోనే సమాధానం చెబుతామని ఇరాన్ విదేశాంగ శాఖ శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించింది. ఆక్రమణదారులకు తగిన గుణపాఠం చెప్పేందుకు తమ సైన్యం సిద్ధంగా ఉందని స్పష్టం చేసింది. తాజా దాడులతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు ఒక్కసారిగా పెరిగాయి. పవిత్ర రంజాన్ మాసం, నౌరోజ్ పండుగ సమయంలో అమెరికా, ఇజ్రాయెల్ దళాలు తమ దేశంలోని రక్షణ, పౌర ప్రాంతాలపై దాడులు చేయడాన్ని ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ఇదొక క్రిమినల్ చర్య అని, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని మండిపడింది. దౌత్యపరమైన చర్చల ద్వారా సమస్య పరిష్కారానికి తాము ప్రయత్నిస్తుండగానే.. ఇలా దొంగచాటుగా దాడులు చేయడం పిరికిపంద చర్య అని ఇరాన్ విదేశాంగ శాఖ పేర్కొంది. యుద్ధాన్ని నివారించేందుకు తాము అన్ని ప్రయత్నాలు చేశామని, ఇక దేశ రక్షణే తమ ముందున్న ఏకైక మార్గమని తెలిపింది. ఐక్యరాజ్యసమితి చార్టర్ ఆర్టికల్ 51 ప్రకారం తమ దేశాన్ని రక్షించుకునే చట్టబద్ధమైన హక్కు తమకు ఉందని ఇరాన్ తెలిపింది. శత్రువుల దుశ్చర్యలను తిప్పికొట్టేందుకు తమ సాయుధ దళాలు పూర్తి సామర్థ్యంతో సన్నద్ధంగా ఉన్నాయని వెల్లడించింది. ఈ దాడుల వల్ల ప్రపంచ శాంతికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని, వెంటనే ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి, ఇస్లామిక్ దేశాలు ఈ చర్యను ఖండించి, తగిన చర్యలు తీసుకోవాలని ఇరాన్ విజ్ఞప్తి చేసింది. చరిత్రలో ఇరాన్ ప్రజలు ఎప్పుడూ విదేశీ ఆక్రమణలకు తలొగ్గలేదని, ఈసారి కూడా శత్రువులు తమ చర్యలకు చింతించేలా బదులిస్తామని హెచ్చరించింది. కాగా, ఇరాన్ కూడా ఇజ్రాయెల్ పై బాలిస్టిక్ క్షిపణులతో దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ సైన్యం ధృవీకరించింది.

## ప్రపంచ యుద్ధం ముంగిట మానవాళి.?

అమెరికా కూడా ఈ ఆపరేషన్‌లో నేరుగా భాగస్వామి కావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. దాడులు మొదలవ్వగానే ఇజ్రాయెల్ అంతటా సైరన్లు మోగాయి. ప్రతీకార దాడుల భయంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఆదేశించారు. విమాన సర్వీసులు నిలిపివేయడం, ఖతార్‌లోని అమెరికా ఎంబసీ 'షెల్టర్-ఇన్-ప్లేస్' ఆదేశాలు ఇవ్వడం చూస్తుంటే యుద్ధం ఇప్పుడప్పుడే ఆగేలా కనిపించడం లేదు.

### వరల్డ్ వార్ 3 ట్రెండింగ్..

దాడుల వార్త వెలువడగానే ఎక్స్ (ఢ) వేదికగా నెటిజన్లు హాహాకారాలు మొదలుపెట్టారు. "మనం తిరిగి రాని స్థితిని దాటేశాం.. సోమవారం ఇంధన మార్కెట్లు కుప్పకూలడం ఖాయం" అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధమే మూడో ప్రపంచ యుద్ధానికి ఆరంభమని, ఇప్పుడు ఇరాన్-ఇజ్రాయెల్ ఘర్షణ దానిని పతాక స్థాయికి తీసుకెళ్లిందని విశ్లేషకులు భావిస్తున్నారు. వరల్డ్ వార్3 అనే హ్యాష్‌ట్యాగ్ గ్లోబల్ వైడ్‌గా ట్రెండ్ అవుతోంది.

### భారతదేశంపై ప్రభావం - ఆందోళనలో సామాన్యుడు..

ఈ యుద్ధం కేవలం ఇరాన్, ఇజ్రాయెల్‌లకే పరిమితం కాదు. దీని సెగ భారతీయ వంటింటి వరకు తగలబోతోంది. ఇంధన సెగ: సోమవారం నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్నంటే ప్రమాదం ఉంది.

**భద్రత:** పశ్చిమ ఆసియాలో లక్షలాది మంది భారతీయులు ఉపాధి పొందుతున్నారు. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, కేరళ వంటి రాష్ట్రాల కుటుంబాలు తమ వారి భద్రతపై ఆందోళన చెందుతున్నాయి.

**విమానయానం:** అంతర్జాతీయ విమాన మార్గాలు మూతపడటంతో ప్రయాణాలు భారం కానున్నాయి.

**చరిత్రను గమనిస్తే..** చిన్న చిన్న సరిహద్దు గొడవలే ప్రపంచ యుద్ధాలకు దారితీశాయి. ఇప్పుడు అగ్రరాజ్యం అమెరికా నేరుగా యుద్ధంలోకి దూకడం, ఇరాన్ అణ్వాయుధాల అంశం తెరపైకి రావడం చూస్తుంటే ప్రపంచం మరో పెను ప్రమాదంలో ఉన్నట్లు కనిపిస్తోంది. దౌత్య మార్గాల్లో శాంతి నెలకొనకపోతే, 2026 ఫిబ్రవరి 28వ తేదీని చరిత్ర 'మూడో ప్రపంచ యుద్ధం ప్రారంభమైన రోజు'గా గుర్తించే ప్రమాదం ఉంది.

## అన్ని పక్షాలు సంయమనం పాటించాలి

ప్రాధాన్యం ఇవ్వాలని భారత విదేశాంగ శాఖ విజ్ఞప్తి చేసింది. సమస్యల పరిష్కారానికి చర్చలు, దౌత్య మార్గాలే శరణ్యమని విదేశాంగ శాఖ పేర్కొంది. "ఉద్రిక్తతలు తగ్గించేందుకు చర్చల ద్వారా ముందుకెళ్లాలి. అన్ని దేశాల సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతను అందరూ గౌరవించాలి" అని ఒక అధికారిక ప్రకటనలో స్పష్టం చేసింది. ఆయా ప్రాంతాల్లోని భారతీయ పౌరులతో తమ దౌత్య కార్యాలయాలు నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాయని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. మరోవైపు టెహ్రాన్, దోహా (ఖతార్), అబుదాబి (యూఏఈ)లోని భారత రాయబార కార్యాలయాలు అక్కడి భారతీయులకు అత్యవసర అడ్వైజరీలు జారీ చేశాయి. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ఇరాన్‌లోని భారతీయులు అనవసర ప్రయాణాలు మానుకోవాలని, సాధ్యమైనంత వరకు ఇళ్లలోనే ఉండాలని టెహ్రాన్ ఎంబసీ సూచించింది. అలాగే ఖతార్, యూఏఈలోని భారతీయులు కూడా అప్రమత్తంగా ఉండాలని, సైనిక స్థావరాలకు దూరంగా ఉంటూ స్థానిక అధికారుల ఆదేశాలను పాటించాలని అక్కడి ఎంబసీలు కోరాయి. ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే ఎంబసీలను సంప్రదించాలని హెల్ప్‌లైన్ నంబర్లను వెల్లడించాయి. ఇరాన్ క్షిపణి వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేసే లక్ష్యంతో అమెరికా దళాలు భారీ దాడులు చేస్తున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించిన నేపథ్యంలో ఈ ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. ఈ క్రమంలో గల్ఫ్ దేశాల్లో ఉన్న భారతీయుల భద్రతపై భారత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

## సర్వైకల్ క్యాన్సర్‌పై సమరం

ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని సమక్షంలో పలువురు పాఠశాల విద్యార్థినులకు టీకాలు వేశారు. అనంతరం మోదీ వారితో ముచ్చటించారు. ఈ బృహత్తర కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా లక్షలాది మంది బాలికలకు భవిష్యత్తులో క్యాన్సర్ ముప్పు నుంచి రక్షణ లభిస్తుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది. నివారణ ఆరోగ్య సంరక్షణకు తమ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు ఈ కార్యక్రమం నిదర్శనమని పేర్కొంది. రాజస్థాన్ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో కూడా పాల్గొన్నారు. కిషన్‌గఢ్ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ, గవర్నర్ స్వాగతం పలికారు. ఈ పర్యటనలో జైపూర్-బండికుయ్ ఎక్స్‌ప్రెస్‌వే, అమృత్‌సర్-జామ్‌నగర్ ఎకనామిక్ కారిడార్‌లోని ఓ భాగాన్ని ఆయన ప్రారంభించారు. అలాగే జోధ్‌పూర్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు నిర్మించనున్న నాలుగు లేన్ల ఎలివేటెడ్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. వీటితో పాటు 'ప్రతి ఇంటికి నీరు' పథకంలో భాగంగా తాగునీటి ప్రాజెక్టులకు, పునరుత్పాదక ఇంధన రంగంలో భాగంగా విద్యుత్ సరఫరా వ్యవస్థ, గ్రిడ్ సబ్-స్టేషన్లకు కూడా ఆయన శంకుస్థాపనలు చేశారు. రాష్ట్రంలో 'రోజ్‌గార్ ఉత్సవ్' కింద కొత్తగా ఎంపికైన 21,800 మందికి పైగా అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. మహిళల ఆరోగ్యం, మౌలిక సదుపాయాల విస్తరణ, ఉపాధి కల్పన లక్ష్యంగా ప్రధాని రాజస్థాన్ పర్యటన సాగింది.

## హైదరాబాద్ రియల్ ఎస్టేట్ ఫ్రాడ్ కేసులో ఆస్తుల అటాచ్

చట్టం 2002 కింద తాత్కాలికంగా అటాచ్ చేశారు. ఈ ఆస్తుల్లో సంస్థ పేరుతో రిజిస్టర్ అయి ఉన్న పలు భూములు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. సాయి సూర్య డెవలపర్స్ ప్రొప్రైటర్ సతీష్ చంద్ర గుప్తా, మరికొందరిపై తెలంగాణ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. నిందితులు ప్రజల నుంచి డబ్బు వసూలు చేసి, ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేశారని పోలీసుల చార్జిషీట్‌లో పేర్కొన్నారు. ఈడీ దర్యాప్తులో మరిన్ని సంచలన విషయాలు వెలుగుచూశాయి. సతీష్ చంద్ర గుప్తా, ఆయన అనుచరులు అనుమతులు లేని లేవుట్లను చూపించి, ఒకే ప్లాట్‌ను వేర్వేరు వ్యక్తులకు విక్రయించినట్లు తేలింది. సరైన ఒప్పందాలు లేకుండానే బాధితుల నుంచి భారీగా నగదు వసూలు చేశారు. బాధితుల నుంచి చెక్కులు, బ్యాంక్ ట్రాన్స్‌ఫర్లు, నగదు రూపంలో సేకరించిన మొత్తాన్ని నిందితులు దారి మళ్లించారు. ఈ నిధులను నేరుగా కాకుండా.. తమ కుటుంబ సభ్యులు, బినామీ సంస్థల పేర్లతో ఉన్న అనేక బ్యాంక్ ఖాతాల్లోకి మళ్లించి (లేయరింగ్) మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు ఈడీ గుర్తించింది. ఇలా అక్రమంగా ఆర్జించిన రూ.14.63 కోట్ల విలువైన ఆస్తులను ప్రస్తుతం ఈడీ జప్తు చేసింది. రియల్ ఎస్టేట్ రంగంలో జరుగుతున్న మోసాలను అరికట్టడంలో భాగంగా ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. మోసపోయిన మదుపరుల ప్రయోజనాలను కాపాడటమే లక్ష్యంగా దర్యాప్తు కొనసాగుతోందని, ఈ నెట్‌వర్క్‌లో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందనే కోణంలో విచారణ జరుపుతున్నామని ఈడీ వర్గాలు వెల్లడించాయి.

## శారదా పీఠం భూములపై ప్రభుత్వం కీలక నిర్ణయం

240లో రెండు ఎకరాల భూమిని శారదా పీఠానికి 2019లో బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించింది. వేద పాఠశాల, రాజశ్యామల అమ్మవారి ఆలయం, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు అత్యంత విలువైన ఈ భూమిని ఎకరాకు ఒక్క రూపాయి చొప్పున నామమాత్రపు ధరకే ప్రభుత్వం అప్పగించింది. వందల కోట్ల విలువైన భూములను ఉచితంగా ఇవ్వడంపై అప్పట్లోనే దుమారం రేగింది. దీనిపై హైకోర్టులోనూ పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ భూమిలో ఆలయ నిర్మాణం పూర్తిచేసి, అత్యద్భుతంగా తీర్చిదిద్దుతామని అప్పట్లో శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి అన్నారు. అంతేకాదు, తన శేష జీవితాన్ని కూడా ఇక్కడే గడుపుతానని పేర్కొన్నారు. ఈ భూముల సమీపంలోనే జలమండలికి కేటాయించడంతో వివాదం మొదలైంది. ఇప్పటికే అక్కడ నిర్మాణాలు కొంత మేర జరగడంతో ఈ అంశంపై సీఎం శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శారదా పీఠం భూముల విషయంలో సరైన సమాచారం ఎందుకు ఇవ్వలేదని అధికారులను నిలదీశారు. కోకాపేట నియోపోలిస్‌లో జలమండలికి అదనంగా 3.95 ఎకరాల భూ కేటాయింపులతో వివాదం మొదలైంది. ఇప్పటికే అక్కడ 8.75 ఎకరాలు ఎంబీఆర్, ఈఎల్ఎస్ఆర్‌ల నిర్మాణానికే సరిపోతాయని, ఓహెచ్‌టీ, సైట్ ఆఫీస్, మెయింటెనెన్స్ కోసం అదనపు భూమి అవసరమని ప్రభుత్వాన్ని జలమండలి అభ్యర్థించింది. 592 మీటర్ల కంటే ఎత్తులో ఉండటం వల్ల గ్రావిటీ ద్వారా నీటి సరఫరా చేయవచ్చని ప్రభుత్వం భావించింది. పంపింగ్ అవసరం లేకుండా ఆ పరిసర ప్రాంతాల ప్రజలకు నీటి సరఫరా చేయవచ్చని తెలిపింది, బోజగుట్ట రిజర్వాయర్‌కు గోదావరి జలాలను గ్రావిటీ ద్వారా తరలించి, అక్కడ నుంచి ఓల్డ్ సిటీ, షేక్‌పేట్, రెడ్ హిల్స్, మెహిదీపట్నం ప్రాంతాలకు తాగునీటిని అందజేయవచ్చిన పేర్కొంది.

## సౌదీ బస్సు ప్రమాద బాధితులకు పరిహారం

పరిహారం అందించారు. నాటి ఘటనలో గాయపడిన వారికి రూ.3 లక్షల చొప్పున తెలంగాణ ప్రభుత్వం పరిహారం అందించింది. నాటి దుర్ఘటన సమయంలో ప్రమాదం గురించి తనకు తెలిసిన వెంటనే సహాయ చర్యలపై కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడినట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. సహాయక చర్యల పర్యవేక్షణ కోసం మంత్రి అజారుద్దీన్‌ను మదీనాకు పంపించిన విషయాన్ని గుర్తు చేశారు. సాధారణంగా దేశం బయట జరిగే ప్రమాదాలకు ప్రభుత్వాలు పరిహారం చెల్లించవని కానీ బాధిత కుటుంబాల పరిస్థితి చూసి సహాయం ప్రకటించామని బాధిత కుటుంబాలకు 5 లక్షలు చొప్పున పరిహారం ఇవ్వాలని మంత్రి వర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. నాంపల్లి అగ్ని ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు కూడా తెలంగాణ ప్రభుత్వం అండగా నిలబడిన విషయాన్ని రేవంత్ రెడ్డి ప్రస్తావించారు.

బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందనే నమ్మకం కల్గించడం ముఖ్యమన్న రేవంత్ రెడ్డి అందుకోసమే బాధిత కుటుంబాలను సెక్రటేరియట్‌కు పిలిపించి పరిహారం అందించామన్నారు. తెలంగాణ ప్రభుత్వం మీ ఆనందంతో పాటుగా కష్టంలోనూ తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. 2025, నవంబర్ 17వ తేదీన సౌదీ అరేబియాలోని మదీనా సమీపంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. యాత్రికులతో వెళ్తోన్న బస్సు ఓ డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. మక్కా యాత్ర పూర్తిచేసుకుని మదీనా వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. బలంగా ఢీకొట్టడంతో బస్సులో మంటలు ఎగసిపడ్డాయి.

ఈ ప్రమాదంలో 45 మంది చనిపోయారు. ప్రమాద సమయంలో అందరూ నిద్రలో ఉండటంతో ఎక్కువ ప్రాణనష్టం సంభవించింది. ఈ ప్రమాదంలో చనిపోయిన వారంతా హైదరాబాద్‌కు చెందిన వారేనని హజ్ కమిటీ పేర్కొంది. 18 మంది మహిళలు, 17 మంది మగవారితో పాటుగా, 10 మంది చిన్నారులు మృతి చెందినట్లు వెల్లడించింది. ప్రమాదం తెలిసిన వెంటనే స్పందించిన తెలంగాణ ప్రభుత్వం కేంద్రంతో కలిసి సహాయకచర్యలు చేపట్టింది. బాధితులకు అండగా ఉంటామని ప్రకటించిన ప్రభుత్వం పరిహారం అందించాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం మేరకు సీఎం రేవంత్ రెడ్డి శనివారం రోజున పరిహారానికి సంబంధించిన చెక్కులు బాధితులకు అందజేశారు.

## నాన్న లేకపోతే ఇన్ని సమస్యలా.?

పని చేస్తున్న మహిళా కానిస్టేబుల్ దివ్య, తన నివాసంలో ఆత్మహత్యకు పాల్పడటం స్థానికంగా పోలీస్ శాఖలో విషాదాన్ని నింపింది. ప్రాథమికంగా ఇది కుటుంబ సమస్యల వల్ల జరిగినట్లు కనిపిస్తోంది. వికారాబాద్ పట్టణంలోని గంగారం సాయిబాబా కాలనీలో ఉంటున్న దివ్య, తన నివాసంలో ఆత్మహత్య చేసుకుంది. ఈ సమాచారం అందుకున్న వెంటనే స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టానికి పంపించారు. ఈ ఘటనతో ఆమె కుటుంబ సభ్యులు, సహచర పోలీసులు, కాలనీ వాసులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

### నాన్న లేకపోవడంతోనే బాధలు అంటూ లేఖ

ఆత్మహత్యకు ముందు దివ్య ఒక సూసైడ్ లెటర్ రాసినట్లు సీఐ రఘుకుమార్ వెల్లడించారు. ఆ లేఖలో " నా చావుకు ఎవరూ కారణం కాదు. నాన్న లేకపోవడం వల్లే మనకు ఇన్ని బాధలు" అని పేర్కొన్నారు. ఏడేళ్ల క్రితమే ఆమె తండ్రి మరణించినట్టు సమాచారం. అయితే బయటకు కనిపిస్తున్న ఈ కారణం వెనుక ఒక బలమైన మానసిక ఒత్తిడి ఉందనే అనుమానం ఆమె సోదరి, బంధువుల మాటలను బట్టి తెలుస్తోంది.

### పెళ్లి సంబంధాలు వెంటాడుతున్న ఒత్తిడి

దివ్య మరణానికి ముందు ఆమె ఒక పెళ్లి సంబంధం విషయంలో తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనైనట్టు తెలుస్తోంది. హైదరాబాద్‌లో అనలిటిక్ ఆఫీసర్‌తో సంబంధం కుదిరింది. అయితే ఈ సంబంధం కుదిరింది. అయితే ఈ సంబంధం విషయంలో దివ్య సందిగ్ధంలో ఉన్నట్టు ఆమె సోదరి వెల్లడించారు. ఆమె సోదరి తెలిపిన వివరాల ప్రకారం "దివ్య చాలా సెన్సిటివిటీ కలిగిన అమ్మాయి. పెళ్లి తర్వాత తన ఉద్యోగానికి ఇబ్బంది కలుగుతుందేమో, తనను మళ్లీ ఇక్కడికి రానిస్తారో లేదో అని అమె ఆందోళన చెందేది. ఒక వేళ పెళ్లిచేసుకుంటే కుటుంబం ఇబ్బంది పడుతుందని ఆమె తరచూ అంటూ ఉండేది" అని చెప్పారు. సంబంధం వచ్చినప్పటి నుంచి అవతలి వ్యక్తి నుంచి ఫోన్ కాల్స్, మెసేజ్‌ల రూపంలో ఒత్తిడి పెరిగినట్టు తెలుస్తోంది. ఎప్పుడు రావాలి, ఎప్పుడు చూడాలి అంటూ పదే పదే కాల్స్ చేసే వారని , దివ్య ఫోన్ ఎత్తక పోతే ఆమె సోదరికి కూడా కాల్స్ చేసినట్టు ఆధారాలు ఉన్నాయి. మరీ ముఖ్యంగా, ఆత్మహత్యకు ముందు రోజు రాత్రి కూడా కార్తీక దివ్యకు ఫోన్ చేసి, తన లొకేషన్ పంపమని కోరినట్టు ఆమె సోదరి పేర్కొన్నారు. నాతోటి కాంటాక్ట్‌లో ఉన్నావు కదా, చెల్లెకు లొకేషన్ ఎందకు పంపమన్నావు అని సోదరి ఆ వ్యక్తిని ప్రశ్నించినట్టు తెలుస్తోంది. ఈ కాల్స్, పెళ్లి విషయంలో వస్తున్న ఒత్తిడి దివ్యను తీవ్రంగా కలచి వేసినట్టు అర్థమవుతోంది.

### ఆఖరి రాత్రి ఏం జరిగింది?

ఆదివారం పెళ్లి చూపుల కోసం చుట్టాలు వస్తున్నారనే విషయంపై శనివారం రాత్రి దివ్య తన సోదరితో చాలా సమయం మాట్లాడారు. ఆ సమయంలో కూడా దివ్య ఎంతో టెన్షన్‌లో ఉన్నారని, ఒక వేళ నాకు అబ్బాయి నచ్చకపోతే కొలీగ్స్ ఏమనుకుంటారో, ఇంత అహంకారం అనుకుంటారా అని భయపడినట్టు తెలుస్తోంది. ధైర్యం చెబుతూ నీకు నచ్చకపోతే నేనే చెప్తాను, నువ్వు టెన్షన్ పడకు అని భరోసా ఇచ్చానని సోదరి తెలిపారు. కానీ లోలోపల మదనపడిన దివ్య ఆ ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలుస్తోంది.

### వృత్తి పరంగా మంచి గుర్తింపు

దివ్య గత ఆరేళ్లుగా పోలీస్ శాఖలో పని చేస్తున్నారు. ధరూర్ పోలీస్ స్టేషన్‌లో రైటర్‌గా ఆమె పనితీరు పట్ల పైఅధికారులు, సహచరులు ప్రశంసలు కురిపించేవారు. ఎవరితోనూ వివాదాలకు వెళ్లకుండా చాలా మంచి అమ్మాయి అని పేరు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. సూసైడ్‌లెటర్‌లో ఉన్న అంశాలతోపాటు ఆమె ఫోన్ కాల్ డేటాను సేకరించారు. పెళ్లి ఒత్తిడి మరీ ఎక్కువగా ఉందా ఆమెను ఎవరైనా మానసికంగా వేధించారా అనే విషయాలపై విచారణ చేస్తున్నారు.

## కాకినాడ జిల్లా వేట్లపాలెంలో
# బాణసంచా కేంద్రం పేలుడు

సహాయక చర్యల గురించి అధికారులతో సమీక్షించారు. సీఎం వెంట బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఇతర స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు. 'సూర్యశ్రీ ఫైర్ వర్క్స్' పరిశ్రమలో జరిగిన ఈ ఘోర దుర్ఘటనలో 23 మంది మృతి చెందడం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. పేలుడు ధాటికి మృతదేహాలు ఛిద్రమై సమీపంలోని పొలాల్లో ఎగిరిపడటం అత్యంత బాధాకరమని సీఎం పేర్కొన్నారు. ఘటనా స్థల పరిశీలన అనంతరం సామర్లకోట ఆసుపత్రికి వెళ్లిన చంద్రబాబు.. అక్కడ చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కాకినాడ జీజీహెచ్ లో చికిత్స పొందుతున్న బాధితులను కూడా సీఎం ఈ సందర్భంగా పరామర్శించారు. కాగా, భద్రతా లోపాలు, అజాగ్రత్తల వల్లే ఈ ఘోరం జరిగిందని ప్రాథమికంగా తెలుస్తోంది. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ కూడా దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కూడా తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధితులకు తక్షణ సాయం అందించేలా ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

# భూ భారతి కాదు.. అది భూ దోపిడీ

హరీష్ రావు మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం ఏ రకంగా భ్రష్టు పట్టించిందో రైతులను ఎలా మోసం చేస్తోందో మాజీమంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు నిలదీశారు.

### 37 మండలాల్లో ఈ భూభారతి కుంభకోణం

'ధరణి పోర్టల్‌లో లోపాలున్నాయంటూ పదే పదే విమర్శలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ తో భూ భారతి తెచ్చామని గొప్పలు చెప్పింది. కానీ ఆ పోర్టల్ ఇప్పుడు ఖజానాకు గండి కొడుతూ దళారులకు భూ హారతి పడుతోంది'అని మాజీమంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు చెప్పుకొచ్చారు.'వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల కోసం ప్రజలు పూర్తి డబ్బులు కడుతుంటే, భూ భారతి పోర్టల్ ఎడిటింగ్ ఆప్షన్ వాడుకుని కేవలం 10 శాతం మాత్రమే ప్రభుత్వానికి చెల్లించి, మిగతా 90 శాతం దళారులు జేబుల్లో వేసుకున్నారు.37 మండలాల్లో ఈ భూ భారతి కుంభకోణం దర్జాగా నడుస్తుంటే, కనీసం నిఘా వ్యవస్థలకు కూడా తెలియకపోవడం ఈ ప్రభుత్వ వైఫల్యమే'అని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఘాటుగా విమర్శించారు.

### ఖజానాకు రావాల్సిన ప్రతీ పైస రాబట్టాలి

'విలేకరులు వార్తలు రాస్తే తప్ప ముఖ్యమంత్రికి, రెవెన్యూ మంత్రికి ఈ స్కాం గురించి సోయి లేదు. ఈ భారీ కుంభకోణం వెనుక అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు, పెద్ద అధికారులు ఉన్నారు. వాళ్ల పేర్లు బయటకు రాకుండా కవర్ చేయడానికే నామమాత్రంగా ఆపరేటర్లను అరెస్ట్ చేసి కేసులు నీరుగారుస్తున్నారు'అని బీర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు.'ప్రతిపక్ష నాయకులను ఇబ్బంది పెట్టడానికి కమీషన్ల మీద కమీషన్లు, సిట్ లు వేస్తున్న రేవంత్ రెడ్డి ఈ భూ భారతి కుంభకోణంపై, ప్రభుత్వ ఖజానా లూటీపై సిట్ తో విచారణ ఎందుకు జరిపించడం లేదు.దీనిపై వెంటనే సిట్ వేసి దోషులను కఠినంగా శిక్షించాలి. ఖజానాకు రావాల్సిన ప్రతి పైసా రాబట్టాలి.పేలని బాంబులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మొదలుకొని మండల స్థాయి అధికారుల వరకు అందరూ కలిసి నిషేధిత భూముల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారు. లక్షల ఎకరాలను ఉద్దేశపూర్వకంగా నిషేధిత జాబితాలో పెట్టడం, వసూళ్లు కాగానే తీసేయడం ఈ ప్రభుత్వానికి నిత్యకృత్యంగా మారింది'అని మాజీమంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ధ్వజమెత్తారు.

### సాదా బైనామాకు ఉరితాడు బిగించింది

'నేడు ఆ జాబితా కోటి ఎకరాలు దాటింది. హైకోర్టు మొట్టికాయలు వేసినా ప్రభుత్వ తీరు మారడం లేదు.అసలు నిషేధిత జాబితాలో ఎన్ని భూములు పెట్టారో వెంటనే శ్వేతపత్రం రిలీజ్ చేయాలి. కేసీఆర్ హయాంలో 6 లక్షల 18 వేల మంది రైతులకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా సాదా బైనామాలు చేసి పాస్ బుక్‌లు ఇచ్చాం. రెండో విడత కోసం 8 లక్షల 92 వేల మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక, గతంలో లేని విధంగా.. భూమి అమ్మిన వ్యక్తి బాండ్ పేపర్ పైన అఫిడవిట్ ఇవ్వాలి అనే కొత్త నిబంధన పెట్టి సాదా బైనామాకు ఉరితాడు బిగించింది'అని మాజీమంత్రి,డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ నిబంధన వల్ల ఇప్పటివరకు ఒక్క రైతుకు కూడా సాదా బైనామా కాలేదు. వెంటనే ఆ బాండ్ పేపర్ నిబంధన తొలగించి పెండింగ్ లో ఉన్న 8.92 లక్షల మంది రైతులకు న్యాయం చేయాలి'అని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు కోరారు.

### పాస్ పుస్తకాల కోసం రూ.300 వసూళ్లు

'ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎల్ఆర్ఎస్ ఫ్రీ అని చెప్పి, ఇప్పుడు ప్రజల ముక్కుపిండి వసూలు చేస్తున్నారు.రిజిస్ట్రేషన్ సమయంలో పాస్ పుస్తకాల కోసం రూ. 300 వసూలు చేస్తున్నారు, కానీ ఆరు నెలలైనా ఒక్క పాస్ బుక్ ఇవ్వడం లేదు. పాస్‌బుక్ లేకపోతే ఎరువులు రావు, బ్యాంకు లోన్లు రావు.. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు'అని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆరోపించారు.'కేసీఆర్ హయాంలో రిజిస్ట్రేషన్ అయిన వారం రోజులకే పాస్ బుక్ నేరుగా ఇంటికి వచ్చేది. ఇప్పుడు ఆన్లైన్ అంటారు, ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ అంటారు ఎందుకు ఇవన్నీ ఫెయిల్ అయ్యాయో రెవెన్యూ మంత్రి సమాధానం చెప్పాలి. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత హైదరాబాద్ పరిసర ప్రాంతాలు, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో పేదలకు ఇచ్చిన లక్ష ఎకరాల ఎస్సీ, ఎస్టీల అసైన్డ్ భూములను గుంజుకున్నారు'అని మాజీమంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

### ఏపీ నీటి దోపిడీని అడ్డుకోండి

'ప్రతిపక్షాల మీద పగబట్టడం, పేదల ఇళ్లు కూలగొట్టడం, కేసీఆర్ కట్టిన గుళ్లను కూడా కూలగొట్టడమే కాంగ్రెస్ ప్రభుత్వ పనిగా మారింది. వందల కోట్లు పెట్టి క్యాంప్ ఆఫీస్ కట్టుకోవచ్చు, వేల కోట్లతో పార్కులు కట్టొచ్చు, ఫుట్ బాల్ ఆడేందుకు డబ్బులుంటాయి, మూసీలో ఇళ్లు కూలగొట్టి వేల కోట్లు ఇవ్వడానికి డబ్బులుంటాయి కానీ రైతుల ఖాతాల్లో రైతుబంధు వేయడానికి మాత్రం రేవంత్ రెడ్డికి డబ్బులు లేవా..?'అని మాజీమంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.'కేసీఆర్ ఉన్నప్పుడు నమ్మకంగా నాట్లకు ముందే రైతుబంధు వచ్చేది. రేవంత్ రెడ్డి ఏమో కేవలం ఓట్ల కోసమే రైతుబంధు వేశాడు. ఇప్పుడు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఉంటే ఖచ్చితంగా రైతుబంధు వేసేవాడు. నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులలో కాంగ్రెస్ ప్రభుత్వం అతి తక్కువ నీటిని వినియోగించుకుంటోంది. సాగర్, శ్రీశైలంలో ఆంధ్రప్రదేశ్ అడ్డగోలుగా మన నీళ్లను మళ్లిస్తుంటే రేవంత్ రెడ్డి గుడ్లప్పగించి చూస్తున్నాడు తప్ప ఆపడం లేదు. కండ్ల గుడ్లు ఊడబీకుతా అని డైలాగులు కొట్టడం కాదు చేతనైతే కేంద్ర మంత్రి దగ్గర కూర్చుని ఆ నీటి దోపిడీని అడ్డుకో'అని మాజీమంత్రి హరీశ్ రావు మండిపడ్డారు.

### హైదరాబాద్‌కు మంచినీళ్ల కటకట వస్తుంది

'ఇరిగేషన్ మంత్రిగా ఉత్తమ్ కుమార్ రెడ్డి పూర్తిగా ఫెయిల్ అయ్యారు. ఇలాగే వదిలేస్తే రేపు హైదరాబాద్‌కు మంచినీళ్ల కటకట వస్తుంది.

రేవంత్ రెడ్డి వచ్చిన తర్వాత సామాన్యుడిపై ధరల భారం పెంచడం నిత్యకృత్యంగా మారింది'అని మాజీమంత్రి హరీశ్ రావు విమర్శించారు. 'పేదవాడు ఒక మోటార్ సైకిల్ కొనుక్కుంటే దాని మీద పదివేల రూపాయల లైఫ్ టాక్స్ పెంచారు.ఆర్టీసీ ఛార్జీలను డబుల్ చేశారు.

ఈ రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో ముఖ్యమంత్రి, మంత్రుల ఆస్తులు పెరిగాయే తప్ప ప్రజలకు ఏ న్యాయం జరగలేదు. ధరలు పెంచడం, కమీషన్లు దంచుకోవడం తప్ప ఈ ప్రభుత్వానికి ఇంకేమీ రాదు'అని మాజీమంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# ఆధ్యాత్మిక రంగానికి తీరని లోటు

## - సౌందర రాజన్ మృతి బాధాకరం

**- చిలుకూరు శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి విశిష్ట సౌందర రాజన్ కృషి అనిర్వచనీయం**

**- వేద పండితులు : దూస భాస్కర్ పంతులు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)చిలుకూరు శ్రీ బాలాజీ ఆలయం ప్రధాన అర్చకులు సౌందర రాజన్ మృతిప్రముఖ పుణ్యక్షేత్రం చిలుకూరు శ్రీ బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు సౌందర రాజన్ స్వర్గస్థులైన నేపథ్యంలో వేద పండితులు దూస భాస్కర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడు, రిజిస్ట్రార్‌గా సేవలందించిన ఆయన ఆధ్యాత్మిక చైతన్య విస్తరణలో విశిష్ట పాత్ర పోషించారని కొనియాడారు. చిలుకూరు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన మహనీయుడిగా స్మరించారు.సౌందర రాజన్ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ కష్టకాలంలో భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని దూస భాస్కర్ ప్రార్థిస్తూ, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# భక్తి శ్రద్ధలతో లక్ష్మీ నరసింహా స్వామి కళ్యాణం



**మాచవరం** మాచవరం మండలం సింగరాయపాలెం తండా సమీపంలోని సింగరుట్ల శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ నరసింహ స్వామి (కొండ సింగరయ్య) వారి కళ్యాణం కొండ దిగువన కళ్యాణ మండపంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుణ్య దంపతుల సమేతంగా పీటల మీద కూర్చొని స్వామివారికి తలంబ్రాలు పోశారు. అనంతరం దాతల సహాయంతో కళ్యాణానికి వచ్చిన భక్తులకు మహా అనుమాన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం అనగా మార్చి ఒకటో తేదీన పిల్లుట్ల గ్రామంలో వసంత సేవ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కళ్యాణానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కళ్యాణం సందర్భంగా చిన్నారులు మహిళలు వేసిన కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమానికి ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రం నుండి భక్తుల పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రాత్రికి ప్రత్యేక విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేస్తారని స్వామివారు పురవీధుల్లో ప్రత్యేక వాహనంపై ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని దేవస్థాన కమిటీ తెలిపారు.

# పివి పాఠశాలలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు




మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మేడ్చల్ సర్కిల్ పరిధిలోని పాపారాయ విద్యానికేతన్ పాఠశాలలో సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి శంకరయ్య హాజరయ్యారు. పాఠశాల యాజమాన్యం ఎంఈఓ శంకరయ్యను పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించడం జరిగింది. అనంతరం విద్యార్థులు చేసిన సైన్స్ కృత్యాలను ఆయన నిశితంగా పరిశీలించారు. విద్యార్థులు చేసిన కృత్యాలు ఆకట్టుకునే విధంగా ఉన్నాయని ప్రశంసించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారతదేశం గర్వించదగ్గ గొప్ప శాస్త్రవేత్త సర్ సి.వి. రామన్ తన అద్భుతమైన ఆవిష్కరణ రామన్ ఎఫెక్ట్ ను ప్రపంచానికి చాటిచెప్పిన రోజును పురస్కరించుకుని ప్రతి ఏటా ఫిబ్రవరి 28న మనం జాతీయ సైన్స్ దినోత్సవం' జరుపుకుంటాము అని తెలియజేశారు.1928 ఫిబ్రవరి 28న సి.వి. రామన్ కాంతి పరిక్షేపణం గురించిన పరిశోధనను విజయవంతంగా పూర్తి చేశారని,ఈ ఆవిష్కరణకు గానూ ఆయనకు 1930లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించిందని అన్నారు.విజ్ఞాన శాస్త్రంలో నోబెల్ పొందిన మొదటి భారతీయుడు, ఆసియా ఖండపు మొదటి వ్యక్తి సర్ సివి రామన్ అని కొడియాడారు. ఆయన గౌరవార్థం 1986లో భారత ప్రభుత్వం ఈ రోజును జాతీయ సైన్స్ దినోత్సవంగా ప్రకటించిందని పేర్కొన్నారు. దేశంలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో జరుగుతున్న అభివృద్ధిని, కొత్త ఆవిష్కరణలను ప్రదర్శించడం నేటి యువత లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు.విజ్ఞాన శాస్త్రం అంటే కేవలం ప్రయోగాలు చేయడం మాత్రమే కాదు, ప్రకృతి రహస్యాలను ఛేదించే నిరంతర అన్వేషణ అని తెలిపారు. అదేవిధంగా సైన్స్ అనేది ఒక సబ్జెక్టు మాత్రమే కాదు, అది ఒక ఆలోచనా విధానం అని,మూఢనమ్మకాలను పక్కన పెట్టి, ప్రతి విషయాన్ని తార్కికంగా ఆలోచించడమే సైన్స్ దినోత్సవం యొక్క అసలైన సందేశం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రామేశ్వర్ రెడ్డి, నరసింహులు గౌడ్, అకాడమిక్ ఇంచార్జ్ అనిత ప్రియా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజల వద్దకే పాలన

**- ఇంటింటికి చేరుకొని ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ముడుమాల గ్రామంలో లబ్ధిదారులకు పంపిణీ చేసిన కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి**



**సి.బెళగల్** ప్రజల వద్దకే పాలన అని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. సి.బెలగల్ మండలంలోని ముడుమాల గ్రామంలో శనివారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లబ్ధిదారుల ఇళ్లకు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి స్వయంగా వెళ్లి, పెన్షన్ అందజేశారు.×ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకాన్ని మరింత మానవీయంగా ప్రజలకు చేరువగా తీసుకెళ్లే దిశగా ప్రభుత్వం నిరంతరం చర్యలు చేపడుతోందన్నారు. మార్చి 1వ తేదీ ఆదివారం కావడంతో లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యగా ఒక రోజు ముందుగానే ఫిబ్రవరి 28వ తేదీనే పెన్షన్‌ను లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేయడం జరుగుతోందని తెలిపారు. ఇది కూటమి ప్రభుత్వ ప్రజాకేంద్రిత పాలనకు స్పష్టమైన నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.×పేద వృద్ధులు,వితంతువులు, వికలాంగులు, నిరాశ్రయుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడి ఇంటి తలుపు తట్టేలా అధికారులు క్షేత్రస్థాయిలో అంకితభావంతో పనిచేస్తున్నారని వెల్లడించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు కూటమి ప్రభుత్వం పట్ల, ముఖ్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రజారంజక, బాధ్యతాయుత పాలనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ముడుమాల గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాల్లో ముందుకు రావాలని, విజ్ఞానం మన జీవితాన్ని అభివృద్ధి చేసే శక్తిగా నిలుస్తుందని ఆయన తెలిపారు. శాస్త్రవేత్తల ఆవిష్కరణలు దేశ ప్రగతికి ఎంతో దోహదపడుతున్నాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్టులను ఎమ్మెల్యే పరిశీలించి వారిని అభినందించారు. చదువుతో పాటు సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు.×ఈ కార్యక్రమంలో మండల నాయకులు, టిడిపి మండల కన్వీనర్ చంద్రశేఖర్, సింగిల్ విండోఅధ్యక్షులు చిన్న తిమ్మప్ప, ఎంపీటీసీ ఈరన్న గౌడ్, జగదీశ్వర్ రెడ్డి, పౌలు, పేమర భీమన్న, ఆయా శాఖల అధికారులు సచివాలయ సిబ్బంది ఆయా గ్రామాల సర్పంచులు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిఎస్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన జి.సాయి ప్రసాద్





**అమరావతి,:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా జి.సాయి ప్రసాద్ శనివారం ఎపి సచివాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు.ఇప్పటి వరకు సిఎస్ గా పని చేసిన కె.విజయానంద్ శనివారం పదవీ విరమణ చేస్తుండడంతో ఆయన నుండి సాయి ప్రసాద్ సిఎస్ గా బాధ్యతలు స్వీకరించారు.ముందుగా తిరుమల తిరుపతి దేవస్థానం మరియు విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానాల వేద పండితుల ఆశీర్వచనాల మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమం అనంతరం ఉ.11.33 గం.లకు సిఎస్ గా పదవీ బాధ్యతలు స్వీకరించారు.ఈసందర్భంగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు ఎస్.ఎస్.రావత్, యం.టి.కృష్ణ బాబు,ఎక్స్ అఫిషియో స్పెషల్ సిఎస్ బి.రాజశేఖర్ తదితర ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు,ముఖ్య కార్యదర్శులు శ్యామల రావు,ముఖేశ్ కుమార్ మీనా,కాంతిలాల్ దండే తదితర ముఖ్య కార్యదర్శులు, ఎస్.సత్యనారాయణ,ఎంఎం నాయక్,ప్రతిభాదేవి తదితర కార్యదర్శులు,వివిధ శాఖాధిపతులు,రాష్ట్ర సచివాలయం సహా వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిథులు సిఎస్ కు పుష్పగుచ్ఛాలు అందించి శుభా కాంక్షలు తెలిపారు.అలాగే రాష్ట్ర 20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకర్ సహా వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు శుభాకాంక్షలు తెలిపారు.ఇంకా వివిధ శాఖల అధికారులు,ఉద్యోగులు సిఎస్ సాయి ప్రసాద్ కు శుభా కాంక్షలు తెలిపారు. 1991 ఐఏఎస్ బ్యాచ్ ఎపి క్యాడర్ కు చెందిన సాయి ప్రసాద్ ఎంటెక్ పట్టభద్రులు కాగా 1991 సెప్టెంబరు 15న ఐఏఎస్ కు ఎంపికై 1992 జూన్ నుండి 1993 మే వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో వరంగల్ అసిస్టెంట్ కలక్టర్ గా పని చేశారు.అనంతరం 1993 సెప్టెంబరు నుండి 1995 ఏప్రిల్ వరకు పాడేరు అసిస్టెంట్ కలక్టర్ గా,1995 ఆగస్టు నుండి 1997 మార్చి వరకు గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా పని చేశారు.అనంతరం 1997 మే నుండి 1998 ఆగస్టు వరకు కడప జాయింట్ కలక్టర్ గా,2000 జూలై నుండి 2003 జూన్ వరకూ కర్నూల్ కలక్టర్ గా, 2003 జూన్ నుండి 2003 అక్టోబరు వరకు చిత్తూరు జిల్లా కలక్టర్ గాప పనిచేశారు.2003 అక్టోబరు నుండి 2004 ఆగస్టు వరకు ఎపి ట్రాన్సుకో జెఎండిగా,2004 ఆగస్టు నుండి 2006 మే వరకు ఇపిడిపిసిఎల్ సిఎండిగా,2006 మే నుండి 2010 ఫిబ్రవరి వరకు ఎపి సిపిడిసిఎల్ సిఎండిగా పని చేశారు.2010 ఫిబ్రవరి నుండి 2011 అక్టోబరు వరకు ఎపి హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ గా పని చేశారు.అనంతరం 2011 అక్టోబరు నుండి 2014 జూన్ వరకు కేంద్ర ప్రభుత్వ ఇంధన శాఖ సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు.తదుపరి 2014 జూన్ నుండి 2016 ఫిబ్రవరి వరకు సియం కార్యదర్శిగా,2016 ఫిబ్రవరి నుండి 2019 మే వరకు సియం ముఖ్య కార్యదర్శిగా పని చేశారు. తదుపరి 2020 జనవరి నుండి 2022 ఫిబ్రవరి వరకు ఎపి సోలార్ పవర్ కార్పొరేషన్ ప్రవేట్ లిమిటెడ్ కు సిఎండి గాను మరియు ఇంధన శాఖ ఎక్స్ అఫిషియో ప్రిన్సిపల్ సెక్రటరీగాను పని చేశారు. అనంతరం 2022 ఫిబ్రవరి నుండి 2024 జూన్ వరకు సిసిఎల్ఏగా పనిచేశారు. తదుపరి 2024 జూన్ నుండి 2025 జనవరి జలవరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, సిఎం ఎక్స్ అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ ప్రస్తుతం సిఎస్ గా పదవీ బాధ్యతలు స్వీకరించారు.

# ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు పంపిణీ చేసాం

**- ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు**

**నరసరావుపేట** నరసరావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే డా??చదలవాడ అరవింద బాబు పట్టణంలో ఉదయం 6 గంటల నుంచే ఇంటింటికి వెళ్లి సామాజిక భద్రతా పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు తదితరులకు స్వయంగా వారి గృహాల వద్దకు చేరుకుని పెన్షన్ అందజేసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా??చదలవాడ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇంటి వద్దే సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. పెన్షన్ అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయాల పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు,పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# లేడీస్ టైలర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా "ప్రపంచ టైలర్స్ డే" వేడుకలు



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పట్టణంలో ప్రపంచ టైలర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని లేడీస్ టైలర్ అసోసియేషన్ సభ్యులు శనివారం ఉత్సాహభరితంగా వేడుకలు నిర్వహించారు.అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి,పరస్పరం మిఠాయిలు తినిపించుకుంటూ సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా లేడీస్ టైలర్ అసోసియేషన్ అధ్యక్షులు సింగర్ శ్రీను మాట్లాడుతూ ముందుగా ప్రపంచ టైలర్స్ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అమెరికా దేశంలో 1819లో జన్మించిన విలియమ్స్ చిన్న వయసులోనే 1845లో కుట్టు మిషన్ రూపొందించి, ఫిబ్రవరి 28న ప్రపంచానికి అంకితమిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కుట్టు వృత్తి ద్వారా ఎన్నో కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయని, ఈ మహనీయుడి సేవలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం టైలర్ డే నిర్వహించడం గర్వకారణమన్నారు.ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు వాసం భూమేశ్వర్, అధ్యక్షులు సింగర్ శ్రీను, క్యాషియర్ పాషా, ప్రధాన కార్యదర్శి కోడం సురేష్, ఉపాధ్యక్షులు గుడిసెల ఆశ, పచారా కార్యదర్శి సతీష్, యూనియన్ సభ్యులు గణేష్, భాగ్యశ్రీ, మానస తదితరులు పాల్గొన్నారు.టైలర్ వృత్తి ప్రతిష్టను పెంపొందించేందుకు భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని అసోసియేషన్ నాయకులు తెలిపారు.

# విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం అవసరం

**- ప్రభుత్వ విప్: ఆది శ్రీనివాస్**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణంలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా కృష్ణవేణి టాలెంట్ స్కూల్, వాణి విద్యాలయంలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌కు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ప్రదర్శనలో విద్యార్థులు రూపొందించిన శాస్త్రీయ నమూనాలను పరిశీలించిన ఆయన, చిన్నతనం నుంచే శాస్త్ర--సాంకేతిక రంగాలపై మక్కువ పెంపొందించుకోవాలని సూచించారు. సైన్స్ పుస్తకాలకే పరిమితం కాకుండా జీవన సమస్యలకు పరిష్కార మార్గమని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో విద్యారంగంలో మార్పులు చేపట్టినట్లు, డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

# ప్రేమ పేరుతో మోసం...
# దళిత యువతిపై అత్యాచారం

**- తల్లి సహకారంతో నిందితుల అరెస్ట్**

**- కరీంనగర్ రూరల్ ఏసీపీ : విజయ్ కుమార్**



**కరీంనగర్ (ప్రశ్న న్యూస్)** ప్రేమిస్తున్నానని నమ్మించి సహోద్యోగిని మోసం చేసి శారీరకంగా దుర్వినియోగం చేసిన యువకుడిని, అతనికి సహకరించిన తల్లిని కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ విషయాన్ని కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్ కుమార్ వెల్లడించారు.ఏసీపీ వివరాల ప్రకారం... మంచిర్యాల జిల్లాకు చెందిన ఓ దళిత యువతి కరీంనగర్ సమీపంలోని చల్మెడ హాస్పిటల్‌లో కొంతకాలంగా ఉద్యోగం చేస్తున్నారు. అదే ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ విభాగంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేస్తున్న బాగోతం రాకేష్ (24)తో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయాన్ని ప్రేమగా మార్చి, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి బాధితురాలిని నమ్మించాడు.గత సెప్టెంబర్‌లో మాట్లాడుకోవాలని చెప్పి బాగోతం రాకేష్ ఆమెను తన ఇంటికి తీసుకెళ్లి శారీరకంగా దుర్వినియోగం చేశాడు. భవిష్యత్తులో పెళ్లి చేసుకుంటామనే నమ్మకంతో ఆమెను పలుమార్లు అత్యాచారం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయం రాకేష్ తల్లి పద్మకు చెప్పగా, పెళ్లి చేసుకోవాలనుకుంటున్నారు కదా అంటూ కొడుకు చర్యలను సమర్థించినట్లు ఆరోపణలు ఉన్నాయి.గత నవంబర్‌లో బాధితురాలు గర్భవతిగా మారడంతో పెళ్లి విషయాన్ని ప్రస్తావించగా, రాకేష్ కొన్ని మాత్రలు తెచ్చి అవి తీసుకోకపోతే చంపేస్తానని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయాన్ని తల్లి పద్మకు చెప్పగా, ఆమె కులం పేరుతో దూషిస్తూ వివాహానికి నిరాకరించినట్లు తెలుస్తోంది.బాధితురాలు కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డికి ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి, అత్యాచారం కేసుపై సమగ్ర విచారణ చేపట్టిన అనంతరం బొమ్మకల్ గ్రామానికి చెందిన బాగోతం రాకేష్, అతని తల్లి పద్మలను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఏసీపీ విజయ్ కుమార్ తెలిపారు. పోలీసులు కేసుపై మరింత దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో
# ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి



**శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకాన్ని రేపు సెలవు దినం కావడంతో ఒకరోజు ముందుగానే పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. అనంతరం వారికున్న సమస్యలను అడిగి తెలుసుకుని సమస్యలు పరిష్కరించే దిశగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ. ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు పేదవారి కష్టాలను అర్థం చేసుకొని రేపు సెలవు దినం కావడంతో ఒకరోజు ముందుగానే లబ్ధిదారులకు పింఛన్లు అందజేయాలని, తమకు ఆదేశాలు జారీ చేయడంతో, ప్రభుత్వ అధికారులతో కూటమి నాయకులతో కలిసి నేడు లబ్ధిదారులకు పింఛన్లను అందజేశామని తెలియజేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని అభివృద్ధి ఒక కుటమి ప్రభుత్వానికే సాధ్యమవుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు.

# రాజన్న సేవలో నిబద్ధతకు నిదర్శనం బ్రహ్మన్నగారి శ్రీనివాస్ సేవలు చిరస్మరణీయం

**- రాజన్న ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు : కూరగాయల శ్రీనివాస్**

**- ఉద్యోగ విరమణ పొందిన శ్రీనివాస్, నటరాజ్ సేవలకు కృతజ్ఞతలు - ఘనంగా వీడ్కోలు**





**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో సహాయ కార్యనిర్వహణాధికారిగా సేవలందించిన బ్రహ్మన్నగారి శ్రీనివాస్ శనివారం ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా ఆలయ సిబ్బంది ఘనంగా వీడ్కోలు సభను నిర్వహించారు. భీమేశ్వర సదన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి రాజన్న ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కూరగాయల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. టి.ఎన్.జి.ఓస్ స్పెషల్ యూనిట్ సభ్యులు, మినిస్టీరియల్ యూనియన్ ప్రతినిధులు, నాలుగవ తరగతి సిబ్బంది యూనియన్ సభ్యులు, ఆలయ ఉద్యోగులు, వేద పండితులు పెద్ద సంఖ్యలో హాజరై తమ అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆలయ ప్రతినిధులు బ్రహ్మన్నగారి శ్రీనివాస్ కు స్వామివారి శేషవస్త్రం కప్పి,ఘనంగా సన్మానించారు. లడ్డు ప్రసాదం, స్వామివారి చిత్రపటాన్ని అందజేసి వారి సేవలను గుర్తు చేశారు. అర్చకులు, వేద పండితులు ఆశీర్వచనాలు అందించగా, సహచర ఉద్యోగులు శాలువాతో సత్కరించి స్మారక బహుమతులు అందజేశారు.

**కూరగాయల శ్రీనివాస్ వ్యాఖ్యలు**


కూరగాయల శ్రీనివాస్,"బ్రహ్మన్నగారి శ్రీనివాస్ తమ విధి నిర్వహణ కాలంలో బాధ్యతాయుతంగా, నిజాయితీతో విధులు నిర్వహించారు. భక్తుల సేవనే ప్రధానంగా భావించి ప్రతి అంశంలో క్రమశిక్షణ పాటించారు. వారి సేవలు ఆలయ చరిత్రలో చిరస్మరణీయంగా నిలుస్తాయి" అని పేర్కొన్నారు.అలాగే ఉద్యోగ విరమణ అనంతరం ఆయన ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.ఇక వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో విధులు నిర్వహించి, అనంతరం బదిలీపై యాదగిరిగుట్టలో పర్యవేక్షకులుగా సేవలందించిన కాంచనపల్లి నటరాజు కూడా పదవీ విరమణ పొందిన సందర్భంగా సభలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. వారి సేవలను స్మరించుకుంటూ ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు.వీడ్కోలు సభ స్నేహపూర్వక, భావోద్వేగ వాతావరణంలో ముగిసింది.

# మేడిబావి బస్తీ లో ఎప్పుడు డ్రైనేజీ సమస్యలే

**- ఇబ్బందుల్లో పాదాచారులు, వాహనదారులు**

**- సమస్యను పట్టించుకోని అధికారులు.**





**సీతాఫలమండి (ప్రశ్న న్యూస్)** సికింద్రాబాద్ నియోజకవర్గం లోని సీతాఫలమండి డివిజన్లోని మేడిబావి బస్తీలో డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. గత వారం రోజులుగా ఈ డ్రైనేజీ పొంగిపొర్లుతున్న అధికారులు కానీ, నాయకులు గాని పట్టించుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పక్కనే ఉన్న ప్రభుత్వ కళాశాల విద్యార్థులు డ్రైనేజీ దుర్గంధం తో పాటు రోడ్డుపైన పారుతున్న మురుగు నటితో అవస్థలు పడుతున్నారు. తీవ్ర దుర్వాసన రావడంతో రోగాల బారిన పడుతున్నారు. వారం రోజులుగా సమస్య ఇలాగే ఉన్న, ప్రతిరోజు డ్రైనేజీ పొంగిపరులుతున్న జలమండలి అధికారులు పట్టించుకోకపోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. కార్పొరేటర్లు ఉన్నప్పుడు ఇదే పరిస్థితి లేనప్పుడు ఇదే పరిస్థితి ఉందని ఇప్పుడు అధికారులు సమస్యలకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. నిన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బస్తీబాట అనే కార్యక్రమం తో బస్తీలు పర్యటించిన అధికారులకు కనీసం చీమకుట్టినట్టు కూడ లేదని కేంద్ర మంత్రి అంటే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు పట్టించుకోరా.? అందుకోసమే కేంద్రమంత్రి పర్యటించిన చిన్న సమస్య కూడా తీర్చలేక పోతున్నారని ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అదే బస్తీలో ఓవైపు లోకల్ లీడర్ రమ్మని గొప్పలు చెప్పుకునే వాళ్లు, మరోవైపు మాజీ కార్పొరేటర్లు ఉన్న సమస్యలు తీర్చడంలో పూర్తిగా మీ బలం చెందారని పేరుకు అందరూ ఉన్నామని చెప్పుకుంటున్నారు కానీ మాకు ఇదేం పరిస్థితి అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు

# ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు

**- సంత్ సేవా లాల్ ఆశయాలు మార్గదర్శకం**

**- ఉత్సవ కమిటీ అధ్యక్షులు డాక్టర్ లక్ష్మీ నారాయణ నాయక్**



**జనగామ(ప్రశ్న న్యూస్)** ఫిబ్రవరి 28 న్ సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు భక్తి, ఆధ్యాత్మిక శ్రద్ధలతో ఘనంగా ఈ కార్యక్రమం జనగామ పట్టణంలో ప్రత్యేకంగా జరిగాయి. ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా డాక్టర్ లక్ష్మీ నారాయణ నాయక్ వ్యవహరించగా, సభకు అజ్మీరా స్వామి నాయక్ అధ్యక్షత వహించారు.జనగామ నియోజకవర్గ శాసన సభ్యులుపల్లా రాజేశ్వర్ రెడ్డి, టీపీసీసీ సభ్యులు డాక్టర్ లక్ష్మీ నారాయణ నాయక్ అలాగే ఆర్డీవో గోపీరామ్ పాల్గొని బోగ్ బండారు కార్యక్రమాన్ని నిర్వహించారు, అనంతరం, సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి గిరిజన సోదర సోదరీమణులకు సంత సేవాలాల్ జయంతి శుభాకాంక్షలు తెలియజేసిన అనంతరం, ఆయన మాట్లాడుతూ, సంతు సేవాలాల్ ఆశయాలు అందరికీ ఆదర్శమని యువత చెడు అలవాట్లకు బానిసలు కాకుండా సన్మార్గంలో నడవాలని కోరారు. బంజారాల అభివృద్ధికి తాను పాటుపడతానని హామీ ఇచ్చారు.ఉత్సవ కమిటీ అధ్యక్షులు టీపీసీసీ మెంబర్ డాక్టర్ లక్ష్మీ నారాయణ నాయక్ మాట్లాడుతూ 287 సంవత్సరాల క్రితం ఎలాంటి చదువు, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి లేని సమయంలో సంత్ సేవా లాల్ సంచార జాతులుగా జీవించిన బంజారాలు స్థిర నివాసం ఏర్పరచుకొని, శాఖాహారం అలవాటు చేసుకుని, మద్యపానంను దూరంగా ఉంచి, వ్యవసాయాన్ని ఆధారంగా జీవించాల్సిన అవసరం ఉంది అని. జాతి ఐక్యతే అభివృద్ధికి మూలమని ఆయన తెలిపారు. జనగామలో బంజారా భవన్ నిర్మాణం, ఠాణు నాయక్ విగ్రహం ఏర్పాటు చేయాలని తెలిపారు.యువత సేవాలాల్ మహారాజ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధి, సేవా కార్యక్రమాల్లో ముందుండాలని, సామాజిక ఐక్యతను కాపాడాలని పిలుపునిచ్చారు. అనంతరం మూడునియోజకవర్గాల పరిధిలోని దాదాపు 100 మంది బంజారా సర్పంచ్‌లను డాక్టర్ లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గోపీరామ్, ఎమ్మార్వో, గాంధీ నాయక్,మూడ్ లక్ష్మణ్ నాయక్, మూడావత్ సంపత్ నాయక్, బిక్షపతి నాయక్, సుమన్ నాయక్, వాంకుడోతు అనిత, కొర్ర రాజేంద్ర నాయక్, భూక్య జూమ్లాల్ నాయక్, భూక్య జయరాం నాయక్, కోటి ,ధారావత్ రాజు నాయక్, బానోత్ వెంకటేష్,కమిటీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థల ప్రతినిధులు, సర్పంచ్‌లు, అభిమానులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్న ప్రసాదం



**శేర్లింగంపల్లి (ప్రశ్న న్యూస్)** హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం హుడా కాలనీ లో నిర్వహిస్తున్న అన్న ప్రసాద భోజన కార్యక్రమం 173 పూర్తి చేసుకుంది. 173వ శనివారం అన్మదాన కార్యక్రమంలో సుమారు 2900 వేల మంది పాల్గొన్నారు. హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం చేపడుతున్న అన్నదానం కార్యక్రమం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. నిత్యం పనులు చేసుకుంటూ జీవనం గడిపే తమకు ప్రతి వారం ఉచిత భోజనం అందజేయడం పట్ల హోప్ ఫౌండేషన్ చైర్మెన్ కొండ విజయ్ కుమార్ కు ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.ం

# శ్రీకాళహస్తి లో జాతీయ టైలర్స్ డే



**శ్రీకాళహస్తి( ప్రశ్న న్యూస్)** శ్రీకాళహస్తి టైలర్స్ అసోసియేషన్ సందర్భంగా బాలయ్య నేతృత్వంలో ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి టైలర్ లకు శుభాకాంక్షలు తెలియజేస్తూ.త్వరలోనే టైలర్లకు టిడ్కో గృహ సముదాయము నందు వారికి శాశ్వత గృహాలు కల్పించే విధంగా కార్యాచరణ చేపడతామన్నారు, శ్రీకాళహస్తి పట్టణంలోని టైలర్లకు గత 15 ఏళ్లుగా టైలర్స్ ఉన్న సమస్యను తాను అధికారంలో వచ్చిన వెంటనే ఆ సమస్యను పరిష్కరించే విధంగా కార్యాచరణ చేసి టైలర్ల సమస్యలు పరిష్కరించామని తెలియజేశారు. అదేవిధంగా శ్రీకాళహస్తి నియోజకవర్గని అంచలంచలుగా అభివృద్ధి చేస్తున్నామని, అభివృద్ధిని చెప్పుకునే వ్యక్తిత్వం తనకు లేదని, తన అభివృద్ధి ప్రజలే చెప్పి నేడు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఈ సందర్భంగా తెలియజేశారు.

# 'విష్ణు విన్యాసం' మూవీ రివ్యూ




గత కొంత కాలంగా కామెడీ కథాంశాలను ఎంచుకుంటూ విజయాలు అందుకుంటున్న కథానాయకుడు శ్రీవిష్ణు. ఇప్పుడు అదే కోవలో మరో వినోదాత్మక కథాంశాన్నిఎంచుకుని ఈ యువ కథానాయకుడు నటించిన చిత్రం 'విష్ణు విన్యాసం'. ఎటువంటి బజ్ లేకుండా విడుదలైన 'విష్ణు విన్యాసం'లో కామెడీ ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసిందా? శ్రీవిష్ణుకు మరో విజయం దక్కిందా? లేదా? అనేది రివ్యూలో తెలుసుకుందాం. జూనియలర్ లెక్చరర్‌గా పనిచేసే విష్ణుకు (శ్రీవిష్ణు) వాస్తు, న్యూమరాలజీ, జాతకాలపై నమ్మకం ఎక్కువ. తాను ఏ పనిచేసినా వీటికి అనుగుణంగా, వాటిని తూ.చ తప్పకుండా ఫాలో అవుతుంటాడు. ఇందువల్లే విష్ణుకు వయసు దాటిపోయినా పెళ్లి కూడా అవ్వదు. ఇక తన కాలేజీలోనే పనిచేసే లెక్చరర్ మనీషా (నయన సారిక) కింద జూనియర్ లెక్చరర్‌గా విష్ణు పనిచేయాల్సి ఉంది. ఇక మనీషాది కూడా ఓ విచిత్రమైన సమస్య. అందువల్లే ఆమెను పెళ్లి చేసుకోవడానికి ఎవరూ ముందుకు రారు, తొలిచూపులోనే విష్ణును ప్రేమిస్తుంది. ఇద్దరి జాతకాలు కలుస్తాయని విష్ణు నమ్ముకున్న సిద్ధాంతి చెప్పడంతో ఆమె ప్రేమను అంగీకరిస్తాడు. అయితే సరిగ్గా ఆమెను పెళ్లి చేసుకునే సమయానికి మనీషా తన జీవితంలో వున్న సమస్యను చెబుతుంది. దీంతో షాక్ తిన్న విష్ణు ఏం నిర్ణయం తీసుకున్నాడు? ఈ ఇద్దరి పెళ్లి జరిగిందా? అసలు మనీషా జీవితంలో ఉన్న సమస్య ఏమిటి? అనేది సినిమా చూసి తెలుసుకోవాల్సిందే. సమాజంలో కొంత మంది మూఢనమ్మకాలుగా, మరికొంత మంది నమ్మకాలుగా పరిగణించే జాతకాలు, న్యూమరాలజీ, వాస్తులను పిచ్చిగా నమ్మే అబ్బాయి, దాని చుట్టు అల్లుకున్న వినోదం, హీరోయిన్ పాత్రకు ఓ విచిత్రమైన సమస్య ఇవీ ముఖ్య అంశాలుగా తయారుచేసుకున్న కథ ఇది. కథలో కొత్తదనం ఏమీ లేకపోయినా, హీరోయిన్ పాత్రను తీర్చిదిద్దిన విధానంలో కాసింత వైవిధ్యత ఉంటుంది. తొలిభాగం సరదాగా శ్రీవిష్ణు సినిమాల తరహాలోనే వన్‌లైన్ పంచ్‌లతో సాగిపోతుంది. కాకపోతే ప్రథమార్థం అంతా ఊహలకు తగ్గట్టే సాగిపోతుంది. హీరో, హీరోయిన్ మధ్య వచ్చే సన్నివేశాలు అక్కడక్కడ నవ్విస్తాయి. కథానాయిక జీవితంలోని అసలు ట్విస్ట్ తెలిసిన తరువాత కథపై ఆసక్తి పెరుగుతుంది. అయితే ఆ ఇంట్రెస్ట్‌ను సన్నివేశాల్లో ఆద్యంతం చూపించలేకపోయారు దర్శకుడు. ముఖ్యంగా కథలో ట్విస్ట్ తెలిసిపోయిన తరువాత కథనం నడిపించడంలో దర్శకుడు తడబడ్డాడు. అయితే కొన్ని సన్నివేశాల్లో శ్రీ విష్ణు తన మార్క్‌తో నవ్వులు పూయించాడు. ముద్దు ఎపిసోడ్‌తో పాటు 'జయం'లోని వీరి వీరి గుమ్మడి పండు పాటతో శ్రీవిష్ణు హీరోయిన్‌తో చేసే వినోదం ఆడియన్స్‌ను కడుపుబ్బా నవ్విస్తుంది. అయితే ఇంటర్వెల్‌కు ముందు కథానాయిక జీవితంలోని సమస్యను రివీల్ చేయడంతో సెకండాఫ్‌లో ఆడియన్స్ ఊహలకు తగ్గట్టే కథనం ఉంటుంది. అయితే సెకండాఫ్‌లో కూడా దర్శకుడు ఎంటర్‌టైన్‌మెంట్‌నే నమ్ముకుని ముందుకు వెళ్లినా ఆ సీన్స్ తేలిపోయాయి. హీరోయిన్‌కు సమస్య ఉన్నా హీరో ఎందుకు పెళ్లి చేసుకోవాలని అనుకుంటాడు? అందుకు కారణమేమిటి అని వివరించే సన్నివేశాలను ఎమోషనల్‌గా తెరకెక్కించినా అవి అంతగా పండలేదు. అయితే పెళ్లి చూపుల ఎపిసోడ్, పెళ్లి చుట్టు అల్లుకున్నవినోదం ప్రేక్షకులకు టైమ్‌పాస్ సన్నివేశాలుగా ఉంటాయి. ముఖ్యంగా సెకండాఫ్ బోరింగ్‌గా, సినిమాటిక్‌గా అనిపిస్తుంది. పతాక సన్నివేశాలు కూడా అంతగా ఆకట్టుకోవు. ఈ చిత్రంలో శ్రీవిష్ణుది వన్‌మ్యాన్ షో. ఆయన విచిత్రమైన డైలాగ్ డెలివరి, కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను నవ్వించాడు. ఈసినిమాను తన భుజస్కందాలపై మోసే ప్రయత్నం చేశాడు.అయితే ఆద్యంతం అది కుదరలేదు. మనీషాగా నయన సారి పాత్ర కొత్తగా ఉంది. ఆమె కూడా ఆ పాత్రనే అంతే సమర్థవంతంగా పోషించిది. స్క్రీన్‌పై నయన సారిక అందంగా కనిపించింది. జ్యోతిష్య శాస్త్రం గురించి తెలియకున్నా అన్నీ తెలిసిన సిద్ధాంతిగా నటించిన కమెడియన్ శ్రీనివాస రెడ్డి నవ్వించే ప్రయత్నం చేశాడు. సినిమా ఆద్యంతం సత్య ఉన్నా ఎందుకో ఆయన కామెడీ మిస్ అయిన ఫీలింగ్ కలుగుతుంది. లెక్చరర్స్ పాత్రల్లో బిళహరిగా ప్రవీణ్, పంకజ్‌గా బ్రహ్మాజీ అక్కడక్కడా నవ్వించారు.

చిత్ర దర్శకుడు రాసుకున్న కథలో నవ్యత లేకపోయినా కామెడీతో సినిమా ఆద్యంతం నడిపించాలనే ప్రయత్నం చేశాడు.అయితే కొన్ని చోట్ల మాత్రం సక్సెస్ అయినా, కంటెంట్ లేకుండా సినిమాను కేవలం వినోదంతోనే విజయా తీరాలకు చేర్చడం అత్యాశే అవుతుంది. కొత్తదనం లేని కథతో ఊహలకు అందే సన్నివేశాలతో, అక్కడక్కడా నవ్వించే ఎంటర్‌టైన్‌మెంట్‌తో 'విష్ణు విన్యాసం' ప్రేక్షకులను పూర్థిస్థాయిలో ఆకట్టుకోవడంలో విఫలమైంది.

## మళ్లీ మళ్లీ నిన్నే చూడాలని..



వరుస విజయాలతో పానిండియా ఇమేజ్‌ను సొంతం చేసుకున్న అడివి శేష్ హీరోగా రూపొందుతున్న రివైంజ్ యాక్షన్ డ్రామా 'డెకాయిట్'. మృణాళ్‌ఠాకూర్ కథానాయిక. షానియల్ డియో దర్శకుడు. సుప్రియా యార్లగడ్డ నిర్మాత. ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానుంది. ఈ సినిమా నుంచి లవ్ మెలొడీ సాంగ్‌ని శుక్రవారం విడుదల చేశారు. ప్రేమ, భావోద్వేగాల కలయికతో సాగే ఈ 'రుబారూ' సాంగ్ సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. 'మళ్లీ మళ్లీ నిన్నే.. చూడాలని అంటున్నది మనసే.. కాసేపు నువ్వునేను కలిసీ.. క్షణంలో లోకమంతా తెలిసీ' అంటూ హీరోహీరోయిన్ల ప్రేమలోని గాఢతను ఆవిష్కరిస్తూ గీత రచయిత భాస్కరభట్ల రవికుమార్ ఈ పాట రాశారు. భీమ్స్ సిసిరోలియో ఈ పాటను స్వరపరచి, చిన్మయితో కలిసి ఆలపించారు. అడివి శేష్, మృణాళ్ ఠాకూర్ పాత్రల సహజమైన కెమిస్ట్రీని ఈ పాటలో చూడొచ్చు. ఈ చిత్రానికి సహనిర్మాత: సునీల్ నారంగ్, నిర్మాణం: అన్నపూర్ణ స్టూడియోస్.

## కాల్షీట్ దొరికితే చాలు!



ఎంత పెద్ద హీరో సినిమా అయినా.. ఎంత గొప్ప ప్రొడక్షన్ అయినా.. పాత్ర నచ్చకపోతే నిర్మొహమాటంగా 'నో' చెప్పేస్తుంది సాయిపల్లవి. ఇలాంటి ఆటిట్యూడ్ కథానాయికలకు కరెక్ట్ కాదనే వాళ్లు లేకపోలేదు. తత్ఫలితంగా విజయాలను వదలుకోవాల్సివస్తుందంటూ కొందరు అభిప్రాయపడ్డారు కూడా. కానీ అందరి అంచనాలను తారుమారు చేస్తూ అఖండ విజయాలను అందుకుంటూ, స్థాయికి తగ్గ పాత్రలను చేజిక్కించుకుంటూ గొప్ప నటిగా ఎదురులేని కెరీర్‌ని కొనసాగిస్తున్నది కలైమామణి సాయిపల్లవి. ప్రస్తుతం తమిళంలో 'అమరన్' దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో రూపొందనున్న సినిమాలో ధనుష్‌కు జోడీ నటిస్తున్నది సాయిపల్లవి. అలాగే, లెజెండరీ డైరెక్టర్ మణిరత్నం దర్శకత్వంలో విజయ్ సేతుపతితో కలిసి ఓ సినిమా చేస్తున్నది. ఇక బాలీవుడ్‌లో 'ఏక్ దిన్' సినిమాతోపాటు, పాన్‌ఇండియా పౌరాణిక చిత్రం 'రామాయణ'లో మహాసాధ్వి సీతగా నటిస్తూ ఏ హీరోయిన్‌కీ లేని లైనప్‌తో దూసుకుపోతున్నది సాయిపల్లవి. మొత్తంగా సాయిపల్లవి కాల్‌షీట్స్ దొరికితే సినిమా సగం విజయం సాధించినట్టే అన్నట్టుగా ప్రస్తుతం నిర్మాతలు భావిస్తున్నారట.

## స్పిరిట్‌లో విలన్‌గా వివేక్ ఒబేరాయ్ ఫస్ట్ లుక్ రివీల్..
## పోస్టర్‌లో కనిపించిన ఐశ్వర్య దేశాయ్ ఎవరు?

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న హై రేంజ్ యాక్షన్ థ్రిల్లర్ 'స్పిరిట్'పై అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. తాజాగా చిత్రబృందం విడుదల చేసిన విలన్ ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబేరాయ్ ఈ చిత్రంలో ప్రతినాయకుడిగా నటిస్తున్న సంగతి తెలిసిందే. "వన్ బ్యాడ్ హ్యాబిట్ ఇన్ స్పిరిట్ మోడ్" అనే ట్యాగ్‌తో విడుదల చేసిన పోస్టర్‌లో వివేక్ ఓబెరాయ్ నోట్లో సిగార్‌తో పవర్‌ఫుల్ యాక్షన్ లుక్‌లో కనిపించారు. పోస్టర్‌ను బట్టి ఆయన ఓ డాన్ పాత్రలో కనిపించనున్నట్లు అర్థమవుతోంది. అయితే అదే పోస్టర్‌లో వివేక్ పక్కన కనిపించిన యువతి ఎవరు? అనే చర్చ సోషల్ మీడియాలో మొదలైంది. ఆమె పేరు ఐశ్వర్య దేశాయ్. యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్ నుంచి మార్కెటింగ్‌లో డిగ్రీ పూర్తి చేసిన ఇండో-అమెరికన్ నటి. బాలీవుడ్ చిత్రం 'గల్లీ బాయ్'లో నటించిన ఆమె, 'ర్యాట్ ఇన్ ద కిచెన్' అనే షార్ట్ ఫిల్మ్‌తో మంచి గుర్తింపు పొందారు. ఆ చిత్రానికి ఉత్తమ సహాయ నటిగా అవార్డు కూడా అందుకున్నారు. ఇప్పుడు 'స్పిరిట్' చిత్రంతో తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. పోస్టర్‌లో వివేక్‌తో కలిసి కనిపించడం వల్ల సినిమాలో ఆమెకు కీలక పాత్ర ఉన్నట్టు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఒక్క పోస్టర్‌తోనే ఆమెకు మంచి క్రేజ్ వచ్చింది. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన త్రిప్తి డిమ్రీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, లుక్స్ ప్రేక్షకుల్లో గూస్‌బంప్స్ తెప్పించాయి. విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ కీలకపాత్ర పోషిస్తుండగా, సీనియర్ నటి కాంచన కూడా ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. టి-సిరీస్ ఫిల్మ్స్, భద్రకాళి పిక్చర్స్ సంస్థలపై భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా, క్రిషన్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో ప్రభాస్ ఇప్పటివరకు చూడని విధంగా ఓ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. మాఫియా బ్యాక్‌డ్రాప్‌తో పాటు పోలీస్ డ్రామా ఎలిమెంట్స్ కూడా ఉండనున్నట్లు టీజర్ సూచిస్తోంది. ముఖ్యంగా పోలీస్ ఆఫీసర్ అయిన ప్రభాస్ జైలుకు వెళ్లే సన్నివేశం స్టోరీపై మరింత హైప్ క్రియేట్ చేసింది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషలతో పాటు చైనీస్, కొరియన్ సహా పలు విదేశీ భాషల్లో వచ్చే ఏడాది మార్చి 5న విడుదల కానుంది. భారీ అంచనాల నడుమ 'స్పిరిట్' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.




## భయపెడుతూ నవ్వించే రుక్మిణి

నిరంజన్, గ్రీష్మ నేత్రికా, ప్రియ, దీప్తి శ్రీరంగం ప్రధాన పాత్రధారులుగా రూపొందుతున్న హారర్ కామెడీ చిత్రం 'రుక్మిణి'. సింహాచలం గుడుపూరి దర్శకుడు. నేలబల్లి సుబ్రహ్మణ్యంరెడ్డి, కట్టా గంగాధరరావు నిర్మాతలు. త్వరలో సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. హీరో మంచు మనోజ్ ఈ టీజర్‌ని లాంచ్ చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. ఈ సినిమాలో నటించడం పట్ల ప్రధాన పాత్రధారులంతా ఆనందం వెలిబుచ్చారు. సాంకేతికంగా అన్ని విధాలా సినిమా ఆకట్టుకుంటుందని, పనిచేసిన అందరికీ మంచి పేరు తెచ్చే సినిమా ఇదని నిర్మాత కట్టా గంగాధర్‌రావు నమ్మకంగా చెప్పారు. నిర్మాతల సహకారం వల్లే ఈ సినిమా ఇంతబాగా వచ్చిందని, త్వరలోనే థియేట్రికల్ రిలీజ్ కానున్నదని దర్శకుడు సింహాచలం గుడిపూరి అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సుభాష్ ఆనంద్, సమర్పణ: నేలబల్లి కుమారి, నిర్మాణం: జీ సినిమా.



## యూట్యూబ్ ఛానల్ ప్రారంభించిన రాజ్‌పాల్ యాదవ్..
## అందరికోసం అంటున్న కమెడియన్

బాలీవుడ్ నటుడు, కమెడియన్ రాజ్‌పాల్ యాదవ్ ఒక యూట్యూబ్ ఛానల్ ప్రారంభించారు. ఈ విషయాన్ని శనివారం ఆయనే సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. అనేక బాలీవుడ్ చిత్రాల్లో నటించిన రాజ్‌పాల్ యాదవ్ ఇటీవల చెక్ బౌన్స్ కేసులో జైలులో లొంగిపోయారు. తాను చెల్లించాల్సిన డబ్బులు అందజేయలేకపోవడంతో కోర్టు ఆదేశాల మేరకు రాజ్‌పాల్ యాదవ్ జైలులో లొంగిపోయారు. తిహార్ జైలులో ఉన్న రాజ్‌పాల్ యాదవ్‌కు దాదాపు రెండు వారాల తర్వాత, ఈ నెల 17న మధ్యంతర బెయిల్ లభించింది. రూ.1.5 కోట్ల డిపాజిట్ అనంతరం అతడికి కోర్టు మార్చి 18 వరకు బెయిల్ మంజూరు చేసింది. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న అతడికి పలువురు బాలీవుడ్ ప్రముఖులు సాయం చేసేందుకు ముందుకొచ్చారు. బాలీవుడ్ సూపర్ స్టార్స్ సల్మాన్ ఖాన్, అజయ్ దేవగణ్, వరుణ్ ధావన్, సోనూ సూద్‌తోపాటు పలువురు రాజకీయ నేతలు, వ్యాపార ప్రముఖులు కూడా సాయం చేశారు. ఈ నేపథ్యంలో కొంత డబ్బు సమకూరడంతో బెయిల్‌పై విడుదలయ్యాడు. ప్రస్తుతం బెయిల్‌పై ఉన్న అతడు కొత్త కెరీర్‌పై దృష్టి సారించాడు. ఈ నేపథ్యంలో తాను యూట్యూబ్ ఛానల్ ప్రారంభిస్తున్నట్లు తెలిపాడు. 'రాజ్‌పాల్ నౌరంగ్ యాదవ్' పేరుతో యూట్యూబ్ ఛానల్ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించాడు. ఇందులో అన్ని వయసులవారికి నచ్చే ఎంటర్‌టైన్‌మెంట్ కంటెంట్ ఉంటుందన్నాడు. వ్లాగ్స్, మినీ సిరీస్, కామెడీ, బీటీఎస్ మూమెంట్స్ వంటివి షేర్ చేస్తానని హామీ ఇచ్చాడు. తన ఛానల్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకోవాలని కోరాడు. దీంతో అతడికి చాలా మంది శుభాకాంక్షలు



# విత్తన శుద్ధితో వ్యాధుల నియంత్రణ సాధ్యం

- వ్యవసాయ విస్తరణ అధికారి : లక్ష్మణ్
- స్తంభంపల్లిలో విత్తన శుద్ధి ప్రదర్శన - రైతులకు అవగాహన శిబిరం
- స్తంభంపల్లి సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్ సమక్షంలో విద్యార్థులచే వ్యవసాయ ప్రదర్శన



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని స్తంభంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం కు చెందిన వ్యవసాయ బీఎస్సీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు కె. అనుషా నాయక్, తనజ్ఞా మహీన్, బి. సుష్మిత, జె. కావ్య ఆధ్వర్యంలో విత్తన శుద్ధి విధానంపై ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు.వ్యవసాయ విస్తరణ అధికారి లక్ష్మణ్ సమక్షంలో ట్రైకోడెర్మా విరిడే మరియు ఫాస్ఫరస్ ద్రావక బ్యాక్టీరియా తో విత్తన శుద్ధి చేసే పద్ధతిని విద్యార్థులు ప్రత్యక్షంగా చూపించారు. బయో ఏజెంట్ల వినియోగం వల్ల నేల ద్వారా వ్యాపించే వ్యాధులను నియంత్రించడంతో పాటు, పంటలకు అవసరమైన ఫాస్ఫరస్ లభ్యత పెరుగుతుందని వారు వివరించారు.ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం రైతుల్లో పర్యావరణహిత వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంపొందించడం. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేందుకు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలని వ్యవసాయ విస్తరణ అధికారి లక్ష్మణ్ సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్, గ్రామపంచాయతీ సభ్యులు, ఆశావర్కర్లు,అధికసంఖ్యలో రైతులు పాల్గొని విద్యార్థుల ప్రదర్శనను ఆసక్తిగా వీక్షించారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు

# కంటి పరీక్షలు కీలకం

- అరైవ్ - అలైవ్ లో భాగంగా డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు - కళ్ళద్దాలు అందజేత
- జిల్లా ఎస్పీ : మహేష్ బి గితే



**వేములవాడ / సిరిసిల్ల (ప్రశ్న న్యూస్)** రోడ్డు ప్రమాదాలను తగ్గించాలనే సంకల్పంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆరైవ్–ఆలైవ్ కార్యక్రమంలో భాగంగా సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ప్రారంభించి, కంటి పరీక్షలు చేయించుకున్న డ్రైవర్లలో అవసరమైన వారికి స్వయంగా కంటి అద్దాలు అందజేశారు.సిరిసిల్ల, వేములవాడ పోలీసుల ఆధ్వర్యంలో కాత్యాయని, ఎల్.వి ప్రసాద్ హాస్పిటల్స్ సిరిసిల్ల, లయన్స్ క్లబ్ ఆఫ్ వేములవాడ, మాతృ శ్రీ, శ్రీ వర్ష కంటి హాస్పిటల్స్ వేములవాడ సంస్థల సహకారంతో ఈ శిబిరాలు విజయవంతంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల బాధ్యత అత్యంత కీలకమని పేర్కొన్నారు. వయస్సు పెరిగేకొద్దీ చూపు మందగించడం సహజమని, ముఖ్యంగా ప్యాసింజర్ వాహనాల డ్రైవర్లు తమ కంటి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయరాదన్నారు. ప్రజల ప్రాణ భద్రత తమ చేతుల్లోనే ఉంటుందని గుర్తించి, తరచూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.స్పష్టమైన దృష్టి లేకుండా వాహనం నడపడం ప్రమాదాలకు కారణమవుతుందని,ఈ నేపథ్యంలో డ్రైవర్లు నిరంతరం ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం అవసరమన్నారు. ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, అతివేగం, ఓవర్ లోడింగ్, ర్యాష్ డ్రైవింగ్, సెల్ ఫోన్ వినియోగం వంటి ఉల్లంఘనలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.శిబిరాల నిర్వహణకు సహకరించిన కాత్యాయని, ఎల్.వి ప్రసాద్ హాస్పిటల్స్ సిరిసిల్ల, లయన్స్ క్లబ్ ఆఫ్ వేములవాడ, మాతృ శ్రీ హాస్పిటల్, శ్రీ వర్ష కంటి హాస్పిటల్స్ వేములవాడ సంస్థలకు ఎస్పీ మహేష్ బి. గితే కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి,సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి, ఇన్స్పెక్టర్లు కృష్ణ, వీరప్రసాద్, ఎస్ఐలు, డాక్టర్ చికోటి సంతోష్, లయన్స్ క్లబ్ సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి దిశానిర్దేశం చేసిన

# శిక్షణా తరగతులు

- పరిపాలనపై సంపూర్ణ అవగాహన పొందిన సర్పంచులు
- ఆదర్శ గ్రామ పంచాయితీ లక్ష్యంగా ముందడుగు
- సర్పంచుల శిక్షణా శిబిరం విజయవంతం
- అధికార యంత్రాంగానికి కృతజ్ఞతలు - జాగిర్యాల గ్రామ సర్పంచ్ : గడల ప్రసాద్



**భీంగల్ (ప్రశ్న న్యూస్)** నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని న్యాక్ సెంటర్ లో భీంగల్ మండలానికి చెందిన గ్రామ సర్పంచులకు 5 రోజులపాటు గ్రామ పంచాయతీ వ్యవస్థ,స్థానిక పరిపాలన,ఆర్థిక నిర్వహణ, అభివృద్ధి కార్యక్రమాల అమలు వంటి అంశాలపై సమగ్ర శిక్షణా తరగతులు నిర్వహించారు.ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా గ్రామ పంచాయతీ పరిపాలనపై సర్పంచులకు సంపూర్ణ అవగాహన కల్పించడంతో పాటు,గ్రామాలను ఉత్తమ గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దే విధానాలపై మార్గనిర్దేశం చేశారు. అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయడం,నిధుల వినియోగం, ప్రజా భాగస్వామ్యం పెంపొందించడం వంటి అంశాలపై అధికారులు విపులంగా వివరించారని ఈ సందర్భంగా జాగిర్యాల గ్రామ సర్పంచ్ గడల ప్రసాద్ హర్షం వ్యక్తం చేసి మాట్లాడుతూ, “ఒక గ్రామాన్ని ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన జ్ఞానాన్ని ఈ శిక్షణ ద్వారా సంపాదించుకున్నాం. శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన జిల్లా కలెక్టర్ కు, మాకు మార్గనిర్దేశం చేసిన అధికారులకు భీంగల్ మండల సర్పంచుల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నాం” అని అన్నారు.భవిష్యత్తులో గ్రామాల సమగ్ర అభివృద్ధికి ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుందని సర్పంచులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# చట్టాల అవగాహనతోనే ఉజ్వల భవిష్యత్తు

- డ్రగ్స్ నియంత్రణ పై విద్యార్థుల నాటిక ఆకట్టుకుంది
- సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్ రావు



**మెట్ పల్లి (ప్రశ్న న్యూస్)** జగిత్యాల జిల్లా, మెట్ పల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం ఉత్సాహభరితంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, చట్టాలపై సరైన అవగాహన కలిగి ఉండటం ప్రతి విద్యార్థి



భవిష్యత్తుకు మార్గదర్శకమని అన్నారు.టీనేజ్ దశలోనే విద్యార్థులు సాధారణ జ్ఞానం, సమకాలీన పరిణామాలతో పాటు పోక్సో యాక్ట్, ఐటి యాక్ట్, మోటర్ వెహికిల్ యాక్ట్ వంటి చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. “చట్టాలు తెలియకపోవడం కారణం కాదని,వాటిని అతిక్రమిస్తే శిక్షలు తప్పవని గుర్తుంచుకోవాలి” అని హెచ్చరించారు. ముఖ్యంగా సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా అనుసరించాలని చెప్పారు.డ్రగ్స్ నియంత్రణపై విద్యార్థులు ప్రదర్శించిన నాటిక కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నారు. అనంతరం సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్ రావును ఉపాధ్యాయ బృందం శాలువాతో సత్కరించింది.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంతి మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు తోగిటి రాజశేఖర్, రిటెయినర్ లాయర్ నల్ల రాజేందర్, న్యాయవాదులు కోటగిరి వెంకట స్వామి, ఓగులపు శేఖర్, ఒజ్జెల శ్రీనివాస్, రాంపల్లి జగన్, తెడ్డు ఆనంద్, ఆకుల సురక్ష, ఆకుల మానస, గురిజెలా గోపి, సామ అనిరుద్, తలారి రాజశేఖర్, బాస రాములు, ద్యావని సత్య నారాయణ, గడ్డం ప్రశాంత్ రెడ్డి, తరి పురుషోత్తం పాల్గొన్నారు. అలాగే ప్రధాన ఉపాధ్యాయులు నారాయణ, ఉపాధ్యాయులు సవిత, శారద, రవీందర్, మోహన్, సురేష్, నవీన్, దామోదర్, లక్ష్మి నారాయణ, రాజేంద్రప్రసాద్, హరిప్రసాద్, జ్ఞానేశ్వర్ హాజరయ్యారు.

## మంథని పట్టణ కేంద్రంలోని

# కాకతీయ హైస్కూల్లో సైన్స్ డే

- భారతదేశ భౌతిక శాస్త్రవేత్త సర్ సర్ సివి రామన్.
- హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ప్రదీప్ రెడ్డి.




**మంథని ( ప్రశ్న న్యూస్)** కాకతీయ హై స్కూల్ లో జాతీయ సైన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సి. హెచ్ ప్రదీప్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ సర్ సి.వి. రామన్ (1888–1970) భారతదేశపు అగ్రశ్రేణి భౌతిక శాస్త్రవేత్త. కాంతి పరిక్షేపణంపై పరిశోధనలు చేసి, 1928లో రామన్ ఎఫెక్ట్ ను కనుగొన్నారు. ఈ ఆవిష్కరణకు గాను 1930 లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి నీ సి వి రామన్ అందుకున్నారు. ఈయన గౌరవార్థం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28 న ‘జాతీయ సైన్స్ దినోత్సవం’ జరుపుకుంటారు.సి వి రామన్ కు 1930: భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి.1954: భారతరత్న పురస్కారం అందుకున్నారు.ద్రవాల గుండా కాంతి ప్రయాణించినప్పుడు దాని తరంగ దైర్ఘ్యంలో మార్పులు వస్తాయని ఆయన నిరూపించారు.ఉద్యోగం చేస్తూనే రాత్రివేళల్లో పరిశోధనలు చేసి విజ్ఞాన శాస్త్రానికి అంకితమయ్యారు.రామన్ ఎఫెక్ట్ వంటి కీలకమైన ఆవిష్కరణల ద్వారా ప్రపంచ వైజ్ఞానిక రంగంలో భారతదేశ కీర్తిని పెంచిన మహనీయుడు.అని అన్నారు.పాఠశాల లో విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులను ఆయన పాఠశాల డైరెక్టర్ తో మరియు పాఠశాల సిబ్బందితో కలిసి పరిశీలించారు. విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్ట్ ల గురించి అందరికీ వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రవికిరణ్ రెడ్డి, శ్రవణ్ రెడ్డి, స్రవంతి రెడ్డి, పావని రెడ్డి, పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ హై స్కూల్

# గుంజపడుగులో సంస్కృతి సైన్స్ డే.

- మూఢనమ్మకాలపైనే సైన్స్ సెమినార్ నిర్వహించారు.



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని మండలంలోని గుంజపడుగు లోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో సంస్కృతి – సైన్స్ – మూఢనమ్మకాల నిర్మూలన పై సైన్స్ సెమినార్ నిర్వహించారు.జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పరిషత్ హై స్కూల్ గుంజపడుగులో ‘సంస్కృతి–సైన్స్–మూఢనమ్మకాల నిర్మూలన’ అంశం పై సైన్స్ సెమినార్ నిర్వహించారు.సంస్కృతి లో మిళితమై ఎన్నో సైన్స్ అంశాలు మన నిత్యజీవితంలో ఎలా ఉపయోగపడుతున్నాయో ఉదాహరణలతో సహా వివరించారు.అదే విధంగా సైన్స్ ను ఉపయోగించుకొని మూఢ నమ్మకాలను ప్రేరేపించి మోసం ఎలా చేస్తారో ప్రయోగ పూర్వకంగా వివరించారు.పరంపర గా వస్తున్న మన జీవన విధానంలో మనకు తెలియని సైన్స్ అంశాలు వివరించారు.చిన్న చిన్న సైన్స్ చిట్కాల తో మంత్ర,తంత్రాలు అని,బోర్ వేయడానికి కొబ్బరి కాయ చేతిలో పట్టుకొని భూగర్భజలాల్ని గుర్తించడానికి చేసే మోసపు విధానాలని ప్రయోగపూర్వకంగా విద్యార్థులకు వివరించారు.సైన్స్ అభివృద్ధిని మానవాళి కి ఉపయోగ పడే మంచి పనులకు మాత్రమే ఉపయోగించి,శాస్త్రీయ పద్ధతిలో విద్యను అభ్యసించి నూతన ఆవిష్కరణ లు చేయడం ద్వారా దేశాభివృద్ధి లో భాగస్వాములు కావాలని విద్యార్థులను కోరారు.అనంతరం సైన్స్ రంగ వల్లుల కార్యక్రమం నిర్వహించారు.సైన్స్ లోని ముఖ్య అంశాలను,పటాలను ముగ్గుల రూపం లో వేయడానికి విదార్థులు ఎంతో ఆసక్తిగా పాల్గొన్నారు...ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు శివలీల, ఉపాధ్యాయులు సురేష్,సంగీత,స్వామి, భూమయ్య,రవీందర్,సతీష్ రెడ్డి,సమ్మయ్య,విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# నూతన ఆవిష్కరణలకు ప్రభుత్వ ప్రోత్సాహం.

- మన మంథని ప్రాంతంలో విద్యార్థుల ప్రతిభను వెలికి తీయాలని.
- ఆలోచనతో డ్రీమ్ స్టార్ట్ రైస్ అనే వ్యవస్థను నెలకొల్పుతున్నాము.
- కొత్త కార్యచరణను మొదలు పెట్టుకొని ముందుకెళ్తున్నాము .
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.





**మంథని ( ప్రశ్న న్యూస్)** మంథనిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, టీ వర్క్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డ్రీమ్ స్టార్ట్ రైస్ వారి ఇన్నోవేషన్ నెట్ వర్క్ కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ....... పెద్ద పెద్ద స్కూల్ లలో చదువుతే తప్ప ఇటువంటివి సాధ్య పడదు అని ఆలోచన చేస్తున్న వారికి దీటుగా.... విద్యావ్యవస్థలో మెరుగుపరిచే విధంగా మారుమూల ప్రాంతమైన మంథని నియోజకవర్గంలోనీ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న చిన్నారుల మేదస్సును ఏఐ ద్వారా మెరుగు పరుస్తున్నామన్నారు. ఒక ప్రధానమైన కాంక్షతో, లక్ష్యంతో యునైటెడ్ నేషనల్ సంబంధించిన సంస్థ చిన్నారుల అందరి భవిష్యత్తులో మార్పు తీసుకువచ్చేటట్లు విద్యకు పెద్దపీట వేయాలనే లక్ష్యంతో యునైటెడ్ నేషనల్ సంస్థ పెద్దలు ఇక్కడికి వచ్చారన్నారు. ఏ విధమైన ప్రయోగాలు చేస్తే, ఏ విధమైన ఉత్పత్తులు ముందుకు వస్తాయో ఆ ఉత్పత్తి ద్వారా పదిమందికి ఉపయోగపడే విధంగా ఆలోచన రంజింప చేస్తదో అదే డ్రీమ్ స్టార్ట్ రైస్ వారు తెలియజేసినారు అన్నారు

# ప్రజా సేవే ధ్యేయంగా కార్పోరేటర్ ఎన్ఎం లక్ష్మీ - ప్రకాష్ ప్రస్థానం అభినందనీయం

- యువజన సంఘాల సమితి రాజన్న సిరిసిల్ల జిల్లాధ్యక్షులు : అమిరిశెట్టి భూమిరెడ్డి
- యువజన సంఘాల ఆధ్వర్యంలో కార్పోరేటర్ దంపతులకు ఘన సన్మానం - శుభాకాంక్షలు



**కరీంనగర్ / బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** కరీంనగర్ మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల్లో ఘన విజయం సాధించి 49వ కార్పోరేటర్‌గా ఎన్నికైన ఎన్ఎం లక్ష్మీ––ప్రకాష్ దంపతులను శనివారం కరీంనగర్‌లోని వారి నివాసంలో యువజన సంఘాల సమితి అధ్యక్షులు అమిరిశెట్టి భూమిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా అమిరిశెట్టి భూమిరెడ్డి మాట్లాడుతూ, “ప్రజల విశ్వాసంతో సాధించిన ఈ విజయం బాధ్యతను మరింత పెంచుతుంది. 49వ డివిజన్ అభివృద్ధి కోసం ఎన్ఎం లక్ష్మీ––ప్రకాష్ దంపతులు కృషి చేస్తారని నమ్మకం ఉంది. ప్రజల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని పారదర్శకంగా పనిచేయాలని ఆకాంక్షిస్తున్నాను” అని పేర్కొన్నారు. యువత, మహిళలు ముందుకు వచ్చి ప్రజాసేవలో భాగస్వాములు కావాలని కూడా ఆయన పిలుపునిచ్చారు.ఈ సన్మాన కార్యక్రమంలో భాజపా కిసాన్ మోర్చా మండలాధ్యక్షులు దేశెట్టి శ్రీనివాస్, భాజపా మండల అధికార ప్రతినిధి సరువు శ్రీనివాస్ పాల్గొన్నారు.

# జిల్లా స్థాయిలో వార్డు సభ్యుల సంక్షేమ

## సంఘం బలోపేతానికి కృషి చేస్తా

- వార్డు సభ్యుల సంక్షేమ సంఘం కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షురాలు : కామెర తిరుమల



**కరీంనగర్ (ప్రశ్న న్యూస్)** కరీంనగర్ జిల్లా వార్డు సభ్యుల సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలిగా కామెర తిరుమలను నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వార్డు సభ్యుల హక్కులు, సంక్షేమం కోసం సంఘం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. గ్రామస్థాయి ప్రజా ప్రతినిధుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ఆయన సూచించారు. రాష్ట్ర కమిటీ చేపట్టే కార్యక్రమాలు, ఆందోళనల్లో చురుకుగా పాల్గొని సంఘ బలోపేతానికి సహకరించాలని పిలుపునిచ్చారు.అనంతరం జిల్లా ఉపాధ్యక్షురాలు కామెర తిరుమల మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్‌కు, అలాగే కరీంనగర్ జిల్లా అధ్యక్షులు మూల కరుణాకర్ గౌడ్‌కు కామెర తిరుమల ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కరీంనగర్ జిల్లాలో వార్డు సభ్యుల ఐక్యత కోసం, వారి సమస్యల పరిష్కారానికి తాను కట్టుబడి పనిచేస్తానని ఆమె పేర్కొన్నారు.ఈ నియామక కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# బిజెపిని నమ్మితే దేశాన్ని అమ్మినట్లే

## - టిపిసిసి సెక్రెటరీ ఎం ఆర్ శ్రీనివాసరావు

- ఎన్నికల ముందే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి పాదయాత్ర గుర్తుకు వస్తాయా.?
- ప్రజల సమస్యలను ఏరోజు పట్టించుకున్న దాఖలాలు లేవు
- రాష్ట్రానికి కేంద్ర నిధులు తీసుకురావడంలో బిజెపి ఎంపీలు పూర్తిగా విఫలం
- హిందుత్వం పేరుతో అధికారంలోకి రావడం తప్ప అభివృద్ధి శూన్యం
- కేంద్రంలో బిజెపి ప్రభుత్వం లేనప్పుడు కూడా అభివృద్ధి బాగా జరిగింది ఇన్ని అక్రమాలు జరగలేదు
- టాక్సీల రూపంలో ప్రజలను దోచి కార్పొరేట్లకు మూటలు కడుతున్న మోడీ సర్కార్





సికింద్రాబాద్(ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో రాజకీయ వేడి రోజురోజుకు పెరుగుతోంది. సికింద్రాబాద్ ఎంపీ, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పై టిపిసిసి సెక్రెటరీ ఎమ్ ఆర్ శ్రీనివాసరావు ఘాటు విమర్శలు గుప్పించారు."ఎన్నికలు దగ్గర పడితేనే ప్రజల సమస్యలు గుర్తుకు వస్తాయా.? ఈ సంవత్సరాల పాటు నియోజకవర్గంలోని సమస్యలను ఎప్పుడైనా పట్టించుకున్నారా.?" అని ప్రశ్నించారు. కేంద్రంలో మంత్రి పదవి దక్కినా, తెలంగాణకు అవసరమైన నిధులు తీసుకురావడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. తెలంగాణ ప్రజలను హిందుత్వం పేరుతో మభ్యపెట్టి ఎంపీ సీట్లు గెలుస్తున్నారు తప్ప తెలంగాణ ప్రజలకు మీరు చేసింది శూన్యమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు ఎంపీగా గెలవడానికిమాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, మాజీ మంత్రి కేటీఆర్ ల పుణ్యమే. వాళ్ల రాజకీయ పరిస్థితుల కారణంగానే కిషన్ రెడ్డి ఈ స్థాయికి చేరుకున్నారని, వ్యక్తిగత కృషి వల్ల కాదని వ్యాఖ్యానించారు. నియోజకవర్గ అభివృద్ధి చేయకపోవడంతో ఎమ్మెల్యేగా మిమ్మలను అంబర్పేట ప్రజలు తిరస్కరించిన విషయం రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు.మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ పాదయాత్రలు చేయడం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమేనని విమర్శించారు. మీ బిజెపి కార్యకర్తలకే మీరు ఏనాడు ఉపయోగపడలేదని మీ కార్యకర్తలే బహిరంగంగా ఎన్నోసార్లు ఈ విషయం తీసుకురావడం జరిగిందన్నారు. మీలాంటి నాయకుడు అధికారంలో ఉండి కూడా ప్రజలకు ఏమి ఉపయోగం అని ప్రశ్నించారు. తెలంగాణతోపాటు గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధిపై బీజేపీ ఎంపీలు, మంత్రులు చూపిన పనితీరు శూన్యమని ఆయన అన్నారు. ఇదంతా ఎందుకు సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఉన్న సమస్యలపై ఒక్కరోజైనా ఎంపీగా మీరు స్పందించారా.? ప్రజలు మీ దగ్గరికి తీసుకువస్తున్న సమస్యలు ఎన్ని తీర్చారు.? కనీసం రిపోర్టర్లతో సమావేశమై స్థానిక సమస్యలపై మీరు సమావేశమైనారా.? స్థానిక రిపోర్టర్లను ఏ రోజైనా ఒక్కరోజు మీరు పిలుచుకొని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారా.? మీకంటే ముందు ఉన్న మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ 100% బెటర్ ఎందుకంటే స్థానిక ప్రజలను కలవడంతో పాటు ప్రతి నెలలో ఒకసారి రిపోర్టర్లను పిలిపించుకొని స్థానిక సమస్యలను తెలుసుకొని పరిష్కరించేవారు ఈ ఆనవాయితీ మీకు లేదు, ఎప్పటికి రాదు కూడా. ప్రజా సమస్యలపై మీడియా స్పష్టమైన సమాధానాలు కోరాలని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ పాదయాత్రలు చేయడం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమేనని విమర్శించారు. సొంత పార్టీ కార్యకర్తలకే ఉపయోగపడని నాయకుడు, ప్రజలకు ఏమి చేయగలడు.? అని ప్రశ్నించారు. గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధిపై బీజేపీ ఎంపీలు, మాజీ కార్పొరేటర్లు చూపిన పనితీరు శూన్యమని ఆయన అన్నారు.మీడియా కూడా వాస్తవాలను వెలుగులోకి తేవాలని, ప్రజా సమస్యలపై స్పష్టమైన సమాధానాలు కోరాలని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ప్రజలు కూడా ఎన్నికల ముందు హడావుడి చేసే ఇలాంటి నాయకులను అస్సలు నమ్మకూడదన్నారు. "అభివృద్ధి మాటల్లో కాదు, కార్యరూపంలో కనిపించాలి" అని స్పష్టం చేశారు.సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ నాయకుడు ఎం ఆర్ శ్రీనివాసరావు విమర్శలపై ఎలా స్పందిస్తారో, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఏమి తీర్పు ఇస్తారో వేచి చూడాలి.

# తార్నాక,నాచారంలో దోమల దండు

## ఫాగింగ్ మరిచిన అధికారులు

**నిధులు ఎక్కడ.? ప్రజల ఆరోగ్యంతో చెలగాటమా.?**

**దోమల సమస్యలపై ఎమ్మెల్యేల మౌనం ఎందుకు.?**

**ప్రతిరోజు ప్రజలకు ప్రత్యక్షంగా కనిపిస్తున్న దోమల నరకం**



**(ఆర్ కె-ప్రశ్న న్యూస్)**

హైదరాబాద్ మహానగరంలో దోమల రాజ్యం విస్తరిస్తోంది. తార్నాక,నాచారం పరిసరాల్లో సాయంత్రం ఆరు గంటలు అయితే చాలు వీధుల్లో నడవడం కష్టసాధ్యంగా మారింది. ఇళ్లలో కిటికీలు తెరవలేని పరిస్థితి. ఎక్కడ చూసిన దోమల దండు ప్రజలను చుట్టుముడుతోంది. కానీ ప్రశ్న ఏంటంటే దోమల నివారణ చర్యలు ఎక్కడ.?ఫాగింగ్ యంత్రాలు మూలన పడేశారా. మీకు నచ్చినప్పుడు ఫాగింగ్ చేస్తే దోమలు నివారణ అవుతాయా. అధికారులు మౌనం ఎందుకు.? ప్రజలు పాలకులకు చెబుతున్నది ఒక్కటే "మున్సిపల్ ఫాగింగ్ వాహనం ఎప్పుడొచ్చిందో గుర్తులేదు"ప్రతి వారం రావాల్సిన ఫాగింగ్ వాహనాలు నెలలుగా కనిపించకపోవడంతో, హెచ్ఎంటి నగర్ చెరువు పై గుర్రపుడెక్క, ఎర్రగుంట చెరువులో మురికి కుంప, కాలనీల్లో నిల్వ నీరు దోమల పెంపక కేంద్రాలుగా మారింది.డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు పెరుగుతున్నాయనే భయం ప్రజల్లో తీవ్రంగా ఉంది.అయిన బాధ్యత వహించాల్సిన అధికారులు, ప్రజా ప్రతినిధులు మాత్రం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**ప్రభుత్వం నిధులు ఇచ్చింది, అయితే పని ఎక్కడ.?**

ప్రభుత్వం ప్రతి ఏడాది దోమల నివారణ కోసం ప్రత్యేక నిధులు కేటాయిస్తోందని అధికార గణాంకాలు చెబుతున్నాయి. అయితే వాస్తవ పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. ఫాగింగ్ నిధులు ఎంతమంది అధికారుల జేబుల్లోకి వెళు తున్నాయో ప్రభుత్వానికే తెలియాలి. ఫాగింగ్ పేరుతో అధికారుల నిర్లక్ష్యం ఒకవైపు ఉంటే మరోవైపు నిధుల స్వాహా కనిపిస్తోందని ప్రజలు బాహాటంగా విమర్శిస్తున్నారు.

**ఇంత తీవ్ర సమస్యపై ఎమ్మెల్యేలు స్పందించరా.?**

నాచారం తార్నాక పరిసర ప్రాంతాలలో దోమలు విపరీతంగా ఉన్నాయని అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్న స్థానిక ఎమ్మెల్యేలు నిర్లక్ష్యం గా వ్యవహరించడం ఎందుకని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక్క రోజైన ఎమ్మెల్యేలు తార్నాక, నాచారం ప్రాంతాలలో గంటసేపు ఒకే ప్రాంతంలో ఉంటే వాస్తవ పరిస్థితి తెలుస్తుందని అప్పుడు ప్రజలు ప్రతిరోజు ఎంత నరకం అనుభవిస్తున్నారో తెలుస్తుంది.పన్నులు క్రమంగా చెల్లిస్తున్నాం. కానీ కనీస సేవలు కూడా లేవు. పిల్లలు బయట ఆడలేరు. వృద్ధులు బయట కూర్చోలేక ఇబ్బంది పడుతున్నారు.విద్యార్థుల హాస్టళ్లు, అపార్ట్మెంట్లు, ఇండిపెండెంట్ ఇళ్లు ఇలా ఎక్కడ చూసినా ఒకే పరిస్థితి దోమలు బాబోయ్ దోమలు అంటూ భయం కలిగిస్తుంది.ఇప్పటికైన పాలకులు మేల్కొని ప్రజల ఆరోగ్యం రాజకీయాలకంటే గొప్పదనిఫోటోలకు పరిమితమయ్యే కార్యక్రమాలు కాకుండా, ప్రతివారం ఫాగింగ్, డ్రైనేజీ శు భ్రపరచడం, లార్వా నివారణ చర్యలు, పబ్లిక్ అవగాహన కార్యక్రమాలు వెంటనే నిర్వహించాలి.దోమలు కుడితే జ్వరం వస్తుంది కానీ అధికారుల నిర్లక్ష్యం వహిస్తే ప్రజా ప్రతినిధులపై ప్రజల విశ్వాసమే పోతుంది. తిరిగి ఎన్నికలలో గెలవడం అసాధ్యం అవుతుంది.తార్నాక,నాచారం లో పరిస్థితి ఇలాగే కొనసాగితే, అది కేవలం డివిజన్ ల సమస్య కాదు ప్రజల ఓట్లతో గెలిచిన పాలకుల వైఫల్యం.

# బాంబు కొరికిన బర్రె పగిలిపోయిన దౌడల్

## పొలంలో పేలిన నాటు బాంబు



సిరిసిల్ల( ప్రశ్న న్యూస్) ఎండాకాలం వచ్చిందంటే చాలు నీటి కోసం జంతువులు గుట్టలు దిగి పొలాల్లోకి వస్తుంటాయి. ఇదే అదునుగా భావించిన వేటగాళ్ళ ఉచ్చులు పెడుతూ, నాటుబాంబులు పెడుతూ జంగల్ లోని జీవరాశులను హతమారుస్తూ మాంసాన్ని విక్రయించి సొమ్ము చేసుకుంటారు. అడవి పందులకు నాటు బాంబులు పెట్టి హతమార్చి కుప్పలు వేసి అమ్ముకుంటుంటారు.

అడవి పందుల కోసం పెట్టిన నాటు బాంబు బర్రె నమలడంతో భారీ శబ్దంతో పేలిన నాటుబాంబు దాటికి బర్రె దౌడలు పగిలి తీవ్ర రక్తస్రావం జరిగిన ప్రమాదకర ఘటన వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పొలంలో పెట్టిన నాటు బాంబు పేలడంతో మేతకు వెళ్లిన పాలిచ్చే బర్రె తీవ్రంగా గాయపడింది. భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో గ్రామస్తులు ఉలిక్కిపడి భయాందోళనకు గురయ్యారు. గాయపడిన బర్రెకు పశువైద్యులు చికిత్స అందిస్తున్నారు.

జంగల్ లోని జంతువుల కోసం ఏర్పాటు చేసిన నాటు బాంబుకు బర్రె బలైందని రైతుకు సుమారు 70 వేల రూపాయల వరకు నష్టం వాటిల్లిందని రైతును ఆదుకోవాలని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

# నిర్మాణ రంగం అంటే కేవలం కాంట్రాక్టు కాదు

## - అది రాష్ట్ర, దేశ నిర్మాణమన్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నిర్మాణ రంగం అంటే కేవలం కాంట్రాక్టు కాదని, అది రాష్ట్ర, దేశ నిర్మాణమని తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ మేనేజింగ్ కమిటీ అండ్ జనరల్ కౌన్సిల్ మీటింగ్–2025–26 కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. రోడ్లు, భవనాల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం కల్పిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వేగవంతమైన అభివృద్ధి లక్ష్యంగా విజన్ 2047 లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. అభివృద్ధికి నిర్మాణ రంగం కీలకమని అన్నారు. ప్రభుత్వంతో కలిసి పనిచేస్తూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని బిల్డర్లకు మంత్రి సూచించారు.ప్రభుత్వాలు ప్రణాళికలు వేస్తాయి, బడ్జెట్ కేటాయిస్తాయి, ప్రాజెక్టులను ప్రకటిస్తాయని కానీ ఆ ప్రణాళికలకు ప్రాణం పోసేది మాత్రం బిల్డర్లేనని అన్నారు. బిల్డర్లు వేసే రోడ్లు ప్రజల ప్రయాణాన్ని సులభం చేస్తాయని, వంతెనలు దూరాన్ని తగ్గిస్తాయని అన్నారు. బిల్డర్లు కట్టే భవనాలు సేవలకు నిలయాలు అవుతాయని అన్నారు. అందుకే నిర్మాణ రంగం అంటే తన వరకు కేవలం కాంట్రాక్టు కాదని, దేశ, రాష్ట్ర నిర్మాణమని వ్యాఖ్యానించారు. అభివృద్ధికి పునాది మౌలిక వసతులేనని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. రోడ్లు బాగుంటేనే పెట్టుబడులు వస్తాయని, కనెక్టివిటీ బాగుంటేనే పరిశ్రమలు వస్తాయని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం సుమారు లక్ష కోట్ల రూపాయల విలువైన పనులు రాష్ట్రంలో కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ రకాల పనులు జరుగుతున్నాయని అన్నారు. ప్రత్యేకంగా రీజినల్ రింగ్ రోడ్డు తెలంగాణ భవిష్యత్తును మార్చే ప్రాజెక్టు అన్నారు. ఈ ప్రాజెక్టు హైదరాబాద్ చుట్టూ ట్రాఫిక్ భారాన్ని తగ్గించడమే కాదని, చుట్టుపక్కల జిల్లాల్లో అభివృద్ధికి మార్గాలు వేస్తుందని అన్నారు. ఇది ఆర్థిక కారిడార్లకు దారి తీస్తుందని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.

# యూఏఈపై ఇరాన్ ప్రతిదాడి

## - బుర్జ్ ఖలీఫాను ఖాళీ చేయించిన ప్రభుత్వం



దుబాయ్ (ప్రశ్న న్యూస్) దుబాయ్‌లోని ప్రపంచంలోని అత్యంత ఎత్తైన భవనం బుర్జ్ ఖలీఫాను అక్కడి ప్రభుత్వం ఖాళీ చేయించింది. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు కలిసి ఇరాన్ మీద దాడులకు పాల్పడుతోన్న విషయం తెలిసిందే. దీనితో ఇరాన్ యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్‌పై బాలిస్టిక్ క్షిపణిలను ప్రయోగించింది. ఈ క్రమంలో బుర్జ్ ఖలీఫా నుంచి ప్రజలను ఖాళీ చేయించారు. అమెరికా సైనిక సిబ్బందికి స్థావరంగా ఉన్న అల్ దఫ్రా వైమానిక స్థావరాన్ని ఇరాన్ దళాలు లక్ష్యంగా చేసుకోవడంతో అబుదాబి, దుబాయ్‌లలో బాంబుల మోత మోగింది. దుబాయ్‌లో భారీ పేలుడు శబ్దం వినిపించిందని, అయితే ఆ శబ్దం క్షిపణి దాడి వల్ల జరిగిందా లేక మరేదైనా కారణమా తెలియాల్సి ఉందని అధికారులు తెలిపారు. దుబాయ్ బీచ్‌ల నుంచి దోహా వీధుల వరకు పేలుళ్ల శబ్దాలు వినిపించడంతో ఇరాన్ ఒకేసారి వివిధ దేశాలలోని అమెరికా లక్ష్యాలపై దాడులు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. యూఏఈ రాజధాని అబుదాబీలో సీఎన్ఎన్ విలేకరులు పేలుళ్ల శబ్దాలు విన్నారు.

# దాడుల్లో వందల మంది అమాయకులు చనిపోయారు

## - భారత్‌లో ఇరాన్ రాయబారి ఫతాలీ




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) శనివారం అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా నిర్వహించిన భారీ దాడుల్లో వందల మంది ఇరాన్ పౌరులు ప్రాణాలు కోల్పోయారని భారత్‌లోని ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలీ వెల్లడించారు. అయితే ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ, అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌కు ఎటువంటి హాని కలగలేదని, వారు పూర్తిగా సురక్షితంగా ఉన్నారని ఆయన ధృవీకరించారు. వారి భద్రత విషయంలో ఆందోళన అవసరం లేదని స్పష్టం చేశారు. ఐఏఎన్ఎస్ వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఫతాలీ మాట్లాడుతూ.. ఈ దాడులను ఇరాన్ సార్వభౌమాధికారంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. ముఖ్యంగా మినాబ్ నగరంలోని ఓ బాలికల పాఠశాల లక్ష్యంగా జరిగిన దాడిలో 50 మందికి పైగా విద్యార్థినులు చనిపోవడం అత్యంత బాధాకరమన్నారు. ఇరాన్ ఎప్పుడూ యుద్ధాన్ని కోరుకోలేదని, కానీ తమ దేశంపై దాడి జరిగితే ఐక్యరాజ్యసమితి చార్టర్‌లోని ఆర్టికల్ 51 ప్రకారం ఆత్మరక్షణ కోసం దీటుగా బదులిస్తామని హెచ్చరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇక దౌత్యపరమైన చర్చలకు ఆస్కారం లేదని, యుద్ధ భాషలోనే సమాధానం చెబుతామని స్పష్టం చేశారు. ఇక ఇరాన్‌లో ఉన్న భారతీయ విద్యార్థులు, ఉద్యోగుల భద్రతపై కూడా ఆయన కీలక ప్రకటన చేశారు. ఇప్పటి వరకు భారతీయులకు ఎలాంటి హాని జరిగినట్లు సమాచారం లేదని తెలిపారు. అక్కడి అధికారుల సూచనలు పాటించాలని కోరారు. ఒకవేళ భారతీయులను వెనక్కి తీసుకురావాల్సిన పరిస్థితి వస్తే, భారత ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి ఇరాన్ సిద్ధంగా ఉందని రాయబారి హామీ ఇచ్చారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588